J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 34 24.01.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



- అత్యుత్సాహం తెచ్చిన తంట - కూటమిలో 'డెప్యూటీ' మంట
- లోకేష్‌ను డెప్యూటీని చేయాలంటూ టీడీపీలో డిమాండ్లు
- పవన్‌ని సీఎం చేస్తారా.. అంటూ జనసేన నుంచి సెటైర్లు

## విభజనకి ఆజ్యం పోస్తున్న..

# చినబాబు భజన

ఆరు నెలల హనీమూన్ సమయం కూడా పూర్తికాకముందే కూటమిలో కొత్త చిచ్చు రాజుకున్నట్లు కనిపిస్తోంది. చినబాబును పెదబాబు చేసే క్రమంలో కొందరు నాయకులు చేసిన డెప్యూటీ సీఎం భజన.. కూటమిలో అభిప్రాయ భేదాలకు బీజం వేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు మేనిఫెస్టో రూపకల్పన, సీట్ల పంపిణీ, ప్రచారపర్వంలో సమష్టి మంత్రాన్ని పాటించి అధికారాన్ని చేజిక్కించుకున్న కూటమి పార్టీలు.. ప్రస్తుతం ఎవరికి వారే యమునా తీరే అనే రీతిలో ముందుకు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. నిజానికి "అదునుకు రాక ముందే పంటను కోసినా.. పాకానికి రాక ముందే వంటను దించేసినా" ఎలాంటి ప్రయోజనం ఉండదన్నది పెద్దల మాట. ఇది లోకేష్ విషయంలో అక్షరాల నిజమనిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు. తగినంత అనుభవం, సమస్యలను సోలోగా పరిష్కరించే ఓర్పు.. పార్టీని ఒక్క తాటిపై నడిపించి.. అన్నీ తానై మెలిగే నేర్పు అలవడినప్పుడే అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల ఫలితం ఉంటుందని.. గొప్పల కోసమో.. మెప్పుల కోసమో పదవులు కట్టబెడితే.. పరపతి పెరగకపోగా.. వికటించి విమర్శల పాలు కావడం తథ్యమని మేధావులు తేల్చి చెప్తున్నారు.

అనవసరమైన సమస్యలెప్పుడూ ఆకాంక్షలతో ప్రారంభమై అనర్థాలకు దారి తీస్తాయని నానుడి. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలను పరిశీలిస్తే ఇది నిజమనేలా కనిపిస్తోంది.

అవును... ఐదేళ్లపాటూ అనేక డక్కాముక్కీలు తిని.. చివరికి అధికారం అందుకున్న కూటమి పార్టీల్లో ప్రస్తుతం అనవసర చర్చ.. కొత్త రచ్చకు కారణమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల మైదుకూరు సభలో తెలుగుదేశం పార్టీ కడపజిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు 'ఇంతై.. అంతై వటుడంతై' అన్నట్లుగా అంతకంతకూ పెరిగిపోతున్నాయి. తమ పార్టీలో మూడో తరం నేత అయిన నారా లోకేష్‌ను ఉప ముఖ్యమంత్రిని చేసి ప్రభుత్వంలో మరింత క్రియాశీలకమయ్యేలా చర్యలు చేపట్టాలంటూ సాక్షాత్తూ చంద్రబాబు సమక్షంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడడం సంచలనంగా మారింది. దీనిపై ఆ పార్టీలోని చాలా మంది నాయకులు స్పందించారు.

### ఒకరివెంట ఒకరిగా..

శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యల వేడి చల్లారకముందే ఆ పార్టీ పిఠాపురం నేత, మాజీ ఎమ్మెల్యే వర్మ ప్రెస్‌మీట్ పెట్టి మరీ లోకేష్ యువగళం పాదయాత్ర ద్వారా పార్టీకి కొత్త ఊపు

10లో




## దానవుడికి..


# దండన!



- చనిపోయేవరకూ జైల్లోనే ఉండేలా అపరాధికి శిక్ష
- కోల్‌కతా హత్యాచార ఘటనలో 3 నెలల్లోనే కోర్టు తీర్పు

నిర్భయ, అభయ, దిశ.. మృగాళ్ళ చేతిలో అసువులు బాస్తున్న మహిళల పేరుతో ప్రభుత్వం తీసుకొస్తున్న కఠిన చట్టాలు.. అయినా అలివిమాలిన కామాంధకారం కలిగిన కొందరు నరరూప రాక్షసులు అబలల పాలిట యముళ్ళుగా మారుతున్నారు. ఇదే కోవలోనే గత ఏడాది ఆగస్టులో కోల్‌కతా ఆర్జీకర్ ఆసుపత్రిలో జరిగిన ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనమైంది.

10లో




# ఆదర్శనీయులు.. ఎన్టీఆర్!

## - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రాష్ట్ర ప్రజలకు అమూల్యమైన సేవలందించారని, భావితరాల వారికి కూడా ఆయన ఆదర్శనీయులని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మనుబోలులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోనే ఎన్నో విధాలైన ప్రజా సంక్షేమ పథకాలకు ఎన్టీఆర్ నాంది పలికారని, రేషన్‌కార్డులు, పింఛన్, పేదలకు ఇళ్లు వంటి ఎన్నో కార్యక్రమాలకు ఎన్టీఆర్ ఒక బ్రాండ్ అనీ ఆయన కొనియాడారు. ప్రత్యేకించి నెల్లూరుజిల్లాలో సోమశిల, కండలేరు జలాశయాలు పుష్కలంగా సాగునీటితో కళకళలాడుతున్నాయంటే అదంతా ఎన్టీఆర్ పుణ్యమేనన్నారు. ఆ జలాశయాల విషయంలో అప్పటి నీటిపారుదల శాఖ మంత్రిగా ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితులైన నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా కీలకపాత్ర పోషించారని ఆయన గుర్తుచేశారు.

### కూటమి ప్రభుత్వ కృషితోనే..

# విశాఖ ఉక్కుకు ఊపిరి

## - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



విశాఖ ఉక్కుకు పూర్వ వైభవం తెస్తానని ఎన్నికల సందర్భంగా హామీ యిచ్చిన చంద్రబాబునాయుడు కేంద్రప్రభుత్వం నుంచి ఆ పరిశ్రమకు 11వేల 440 కోట్ల ఆర్థిక ప్యాకేజి సాధించి మాట నిలబెట్టుకున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొనియాడారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వ నేతలు.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు, విశాఖ ఉక్కుకు ఆమేరకు భారీ ఆర్థిక ప్యాకేజి ప్రకటించిన ప్రధాని నరేంద్రమోడీకి, కేంద్ర మంత్రి కుమారస్వామిలకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం నిరంతరం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూ ఆర్థిక ప్యాకేజి సాధించడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్మికుల కష్టాలను అర్థం చేసుకుని, ఆర్థిక ఒడిదుడుకుల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమ పునరుద్ధరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషి అమోఘమన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో విశాఖ ఉక్కు పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని, నేడు కూటమి ప్రభుత్వం సమష్టి కృషితో విశాఖ ఉక్కు పరిరక్షణ సాధ్యమైందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే రాష్ట్ర వ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు ఎంతగానో మెరుగవుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ఇబ్బందుల్లో ఉన్న ప్రతిసారీ ఆదుకుంది తెలుగుదేశం ప్రభుత్వమేనని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విశాఖ స్టీల్‌కు దుర్గతి పట్టిందని ఆమె పేర్కొన్నారు.

# ఫిబ్రవరి 1న జగన్నాథ రథయాత్ర

## - ఇస్కాన్ మందిరం అధ్యక్షులు శ్రీ సుకదేవస్వామి వెల్లడి



నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1వ తేదీన పెద్దఎత్తున జగన్నాథ రథయాత్రను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఆ కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని ఇస్కాన్ మందిరం అధ్యక్షులు శ్రీ సుకదేవస్వామి కోరారు. ఈనెల 20న ఆయన ఇస్కాన్ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రథయాత్రలో నెల్లూరు నుంచే కాక, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొంటారన్నారు. 1వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక అలంకార్‌సెంటర్ నుంచి బయలుదేరి పెద్దబజార్, వీఆర్‌సి కూడలి, మద్రాసు బస్టాండు కూడలి మీదుగా ఆర్టీసీ వద్దనున్న సర్వోదయ కళాశాలకు చేరుకుంటుందని తెలిపారు. రథయాత్రలో భజనలు, కోలాటాలు, హారతులు, భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఆ తర్వాత భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక ప్రముఖులు డివిఎస్ గిరికృష్ణారెడ్డి, కొట్టె రామమూర్తి, రాజశేఖర్, ఇస్కాన్ మందిరం సభ్యులు పాల్గొన్నారు.

# డీఆర్ఓ ఆధ్వర్యంలో శ్రమదానం

'స్వచ్ఛ దివస్'లో భాగంగా ఈనెల 18న నెల్లూరులోని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కలెక్టరేట్ ఆవరణను శుభ్రం చేశారు. పారలు చేతపట్టి పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రతి మూడవ శనివారం స్వచ్ఛసేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కలెక్టరేట్ సిబ్బంది, ట్రెజరీ తదితర శాఖల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సంకీర్తనల గానంతో.. త్యాగరాజస్వామి ఆరాధన




నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న శ్రీ త్యాగరాజస్వామి మందిరంలో ఇటీవల ఆరాధనోత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా సద్గురు శ్రీ త్యాగరాజస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పల్లకిసేవ అనంతరం, స్థానిక సంగీత విద్వాంసులు, గాన కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన పంచరత్న గోష్ఠిగానం అందరినీ ఆకట్టుకుంది. తొలుత, త్యాగరాజ సేవాసమితి వ్యవస్థాపకులు యనమండ్ర నాగదేవిప్రసాద్ పర్యవేక్షణలో, మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నగర సంకీర్తన జరిగింది. మందిరంలో కొలువై ఉన్న శ్రీ సీతారాముల మూలవర్లకు విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ గావించారు.

### మనిషిని పోస్టుమార్టం చేసిన..

# నాగేంద్ర కవితా సంపుటి 'అలా ఆగు కాసేపు'

నెల్లూరు సాహితీ లోకంలో అందెవేసిన చేయి, తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ కవిగా సుప్రసిద్ధులు ఏటూరి నాగేంద్రరావు. నిరంతర అధ్యయనం ఆయనకు ప్రాణ సమానం. 'అలా ఆగు కాసేపు' ఆయన సరికొత్త కవిత్వంగా వెలువడి ప్రశంసల నందుకొంది. మనిషి అంతరంగాన్ని పరిశీలించి అంతర్లీనంగా వైవిధ్య భావ పరంపరల్ని వ్యక్తీకరించి కవిత్వీకరించడంలో అగ్రగణ్యులు ఏటూరి. మరణం ఆయనతో మాట్లాడుతుంది. ఆశ్చర్యపోకండి ఇది నిజం. మరణంపై విభిన్న భావపరంపరను మనకందించడంలో కృతకృత్యుదయ్యారు నాగేంద్ర.




రచయిత
**ఏటూరి నాగేంద్రరావు**
వెల: రూ. 100/- పేజీలు: 107
ప్రతులకు: ఏటూరి నాగేంద్రరావు
ఫ్లాట్ నెం.క్యూ5, అపర్ణ సైబర్‌జోన్, రత్నదీప్ ఎదురు, నల్లగండ్ల, సెరిలింగంపల్లి, హైదరాబాదు-19. సెల్: 7416665323

మనిషి పదేపదే మరణించడం అనేది కవి అంతరంగ వేదన. మనిషిలో మనిషే దూరం కావడం కూడా ఒక వైవిధ్య భరిత సంవేదన. నాకిప్పుడు మనిషికి సంబంధించిన ఆనవాళ్ళు కావాలని నాగేంద్ర సమాజంతో యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. జాతి అంతరాత్మను తట్టి లేపి మనిషిని బ్రతికించుకోవాలని, మనిషిలేని లోకంలో ఎన్నాళ్ళని జీవిస్తూ ఒంటరితనాలు భరిస్తూ, నన్ను నేను నిద్రపుచ్చుకోవాలా అని ప్రశ్నించడం గొప్ప భావన. 'ఇది నా జాతి అంతరాత్మ కవితలోని ఆయన ఆత్మగా ప్రకటిస్తున్నారు.

'అలా ఆగు కాసేపు' ఈ రాత్రయినా మనసు నిండా నిన్ను నువ్వు కౌగలించుకో. ఉరుకుల పరుగుల జీవితంలో నీ విస్మయ హేల చూస్తే జాలేస్తుంది. నీలో చప్పుడు నీకు విన్పించడం లేదా అని ప్రశ్నిస్తారు. ఆ చప్పుడు విను నీ అంతరాత్మను ప్రశ్నించుకో. అంతేతప్ప పరుగెత్తమాకు. ఇక ఏ ఇసుకలోనూ నీ అడుగుజాడలు కన్పించవు సుమా! అంటూ సున్నితంగా హెచ్చరిస్తున్నారు కవి. మనిషిని అర్థకుడిగా చిత్రించి ఆ భావనను మరచిపోవడం వల్లే నీ ప్రతాపం అని కూడా చెప్పున్నారు. నీ ఆక్రోశం నవ్వులాటగా ఉందంటారు వ్యంగ్యంగా! ప్రతి కవిత లోనూ మనిషిని తూర్పారబట్టే ఉదంతం చూడవచ్చు. నీవు మనిషివై పుట్టి ప్రతిదానికీ వ్యధచెందుతూ ఎలా నిల్చుంటావు 'అలా ఆగు కాసేపు' అని మనిషిని నిలువరిస్తారు. ఇది తొలి కవిత టైటిల్ కవితగా ప్రచురించారాయన.

నాతోపాటు రా, జీవితాన్ని ఆడిట్ చేసుకుందాం అంటూ ప్రకటిస్తారు కవివర్యులు. దక్కించుకోవాల్సినవి దక్కించుకున్నావ్ లేదో తెలియాలంటే 'ఆడిట్' చేసుకోవడమనే సరికొత్త మార్గాన్ని ఎంచుకోవడం ఆయన భావజాలంలో వినూత్నంగా మెరిసిన సొగసు. ఆ పదాన్ని ఇక్కడ తీసుకురావడం గొప్ప విజయానికి తార్కాణం. ధరిత్రి చరిత్రలో ప్రజలదే విజయపతాకం. 'రాజ్యాలేలినారు రాజులు.. ఎవరికెవరు ఉంచినారు కులసతులకు గాజులు' అని ఓ సినిమా కవి నివ్వెరపోయినట్లు ప్రజల పట్ల తన మమకార ప్రకటన చేస్తారాయన. ఈ 'ఆడిట్' కవితలో.

నేను పుట్టాను లోకం నవ్వింది, నేను నవ్వాను లోకం ఏడ్చింది.. అని అంటారు ఆచార్య ఆత్రేయ. అలాంటి గొప్ప వాక్యాన్నే చెప్పారు నాగేంద్ర. నీ కన్నీళ్ళను ఎవరైనా తుడవాలని చూశావో గుండె బరువెక్కుతుంది. కూరుకుపోతుంది. అలా అతిగా ప్రవర్తించవద్దు ఈ లోకంలో.. అని మనిషిని హెచ్చరిస్తున్నాడు కవి. ఈ లోకం బాధ తన బాధగా కన్నీటిపర్యంతం చేస్తారు కవి. నీ తోటలోని పూలైనా నిన్ను పలకరిస్తాయి కాని, సాటిమనిషి మాత్రం మనిషి పట్ల మమకారం చూపడని ఆర్తితో చెప్తారాయన. ఇది 'గుండె కూరుకుపోతుంది' అనే చిన్న కవితలోని అంతర్యం.

మృత్యువుపై ఆయన భావాలు అనేకం. మృత్యువుతో పోరాటం చేస్తారాయన. మృత్యువుతో సంభాషిస్తారాయన. కాల గమనంలో మార్పుల్ని రికార్డు చేస్తారాయన. ఆ మార్పులు ఎవరో చిత్రకారుడు అతిశ్రద్ధగా చేస్తున్న అధివాస్తవిక చిత్రంలా కలవరపెడుతుందని బాధాతప్త హృదయులవుతారు 'కలవరం' కవితలో. అదే కవితలో మరో దృశ్య కావ్యాన్ని మన ముందుంచుతారు. తన చుట్టూ కొన్ని బ్రతికున్న దేహాలు కాలిపోతున్న దృశ్యం అవగతమవుతుందని చెప్పడం ఎంతటి భావనా పటిమో అంతః శోధనలో. సాటి జీవి మృత సంభాషణ తాను విన్నచందాన్ని వివరించడం, చిన్నచిన్న కవితల్లోని విశాలతతో మనకు దిమ్మ తిరుగుతుంది.

శవ ప్రదర్శన కూడా వాణిజ్యమైనప్పుడు, మరణాన్ని కొనుక్కోవడానికి కూడా పర్మిషన్ కావాలేమోనని విస్మయం చెందుతారు. స్వతంత్ర దేశంలో చావు వాణిజ్యమవడాన్ని, మరణించడానికి స్వేచ్ఛ లేకపోవడాన్ని నిర్భయంగా ప్రశ్నించే కవి నాగేంద్ర 'అద్దె లేని లాడ్జి ఆ ఇల్లు' కవితలో. ప్రతి కవితా ఈ పుస్తకంలో వైవిధ్యభరితమే కావడంతో కవి తన సత్తా చాటినట్లయింది.



సమీక్షకులు:
**చిన్ని నారాయణరావు**
9440202942

# రూపాయి పాతాళానికి డాలర్ ఆకాశానికి!




అమెరికా డాలర్‌తో పోలిస్తే మన రూపాయి అథఃపాతాళానికి పడిపోతోంది. గురువారం మధ్యాహ్నానికి రూపాయితో పోలిస్తే డాలర్ విలువ 86.51 రూపాయలకి చేరింది. ఈ పరిణామం ఎగుమతిదారులని ఆనందపరుస్తుంటే.. దిగుమతిదారులని ఆందోళనకి గురిచేస్తోంది. ఈ పెరుగుదల భారతీయ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. డాలర్ రేటు అమాంతం పెరిగి, రూపాయి క్షీణిస్తే కేవలం కొంతశాతం మంది లాభపడతారు తప్ప, అధికశాతం మంది నష్టపోతారని జోస్యం చెప్తున్నారు. ముఖ్యంగా అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులకి ఈ పెరుగుదల పెనుభారం అవుతుందని అంటున్నారు. అమెరికాలో సంపాదిస్తూ భారతదేశానికి డబ్బు పంపేవారికి ఇది మంచి తరుణం. అయితే, ఇక్కడ ఆస్తులు అమ్ముకుని అమెరికాకి తీసుకువెళ్లాలనుకునే వారికి మాత్రం ఈ పరిణామం మింగుడు పడడంలేదు.

### అక్కడి నుండి ఇక్కడికి... ఇక్కడి నుండి అక్కడికి...

గత మూడు లేదా రెండు దశాబ్దాల క్రితం అమెరికా దేశానికి వెళ్లి స్థిరపడిన వారికి ప్రస్తుత పరిస్థితి మింగుడు పడడంలేదు. వాళ్లు అక్కడికి వెళ్లిన తొలినాళ్ల నుండి సంపాదించిన దాంట్లో కొంత భారతదేశానికి పంపేవాళ్లు. ఇక్కడ వాళ్ల అమ్మానాన్నలో బంధువులో ఆ డబ్బుని భూమిపైనో లేక బంగారుపైనో పెట్టుబడిగా పెట్టి తమ వాళ్ల ఆస్తులు పెంచేవాళ్లు. ఎప్పటికైనా వాళ్లు ఇండియాకి తిరిగొచ్చేస్తారన్నది వారి ఆశ. కొన్నేళ్లకి అమెరికా జీవితానికి అలవాటుపడ్డ అప్పటితరం తిరిగి ఇండియాకి రావడానికి ఇష్టపడడం లేదు. తమ ఆస్తులని అమ్ముకుని తిరిగి అమెరికాకి తీసుకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. అలాంటి వారికి ప్రస్తుత పరిస్థితి క్లిష్టమైందిగా కనిపిస్తుంది. అదే తరహాలో ఇప్పటి తరం కూడా భారతదేశంలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తిచూపిస్తున్నారు. పాత తరం తరహాలోనే ఈ తరం యువత కూడా తమ సంపాదనలో కొంత భారత్‌కి పంపించి ఇక్కడ ఇన్వెస్ట్ చేస్తున్నారు. అలాంటి వాళ్లకి మాత్రం డాలర్ విలువ పెరుగుదల లాభసాటిగా కనిపిస్తుంది.

### పెరిగితే ప్రమాదమే!

మొత్తంమీద చూసుకుంటే ఇలా డాలర్ పైపైకి పాకి రూపాయి పాతాళానికి పడిపోతే దేశ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమవుతుందని లెక్కల మాంత్రికులు (ఆర్థిక నిపుణులు) చెప్తున్నారు. పరిస్థితిని చక్కదిద్దకపోతే డాలర్ విలువ మూడంకెలు(100) దాటినా ఆశ్చర్యపోనవసరంలేదని వాళ్లు చెప్తున్నారు. భారత్ ఆర్థిక భవిష్యత్ ఏ మలుపు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే!

# స్ఫూర్తిదాయక నేత..నేతాజీ!


## • జయంతి వేడుకల్లో వక్తలు




ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు నెల్లూరులో ఘనంగా జరిగాయి. నగరంలోని శ్రీ నేతాజీ విద్యాసంస్థల ఛైర్మెన్ ఎంవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయులతో కలసి దేశనాయకుల వేషధారణలతో చిన్నారులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మినీబైపాస్‌రోడ్డులోని నేతాజీ విగ్రహానికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ నాయకులు నలుబోలు బలరామయ్యనాయుడు, జి.లక్ష్మణకుమార్‌రెడ్డిలు పూలమాలలు వేసి వందనం చేశారు. నేతాజీ సేవలను వారు ఈ సందర్భంగా స్మరించుకుంటూ, విద్యార్థులకు నేతాజీ దేశభక్తిని వివరించారు. నేతాజీ స్ఫూర్తిదాయకమైన నేత అని కొనియాడుతూ, స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పాత్ర ఎంత ఘనమైనదో వక్తలు చిన్నారులకు విశదీకరించారు. నేతాజీ విద్యాసంస్థల డైరెక్టర్ డా.సుబ్రామ్, నేతాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు వేదవతి సుబ్బారెడ్డి, పాఠశాల సీనియర్ డైరెక్టర్ నరేంద్రరెడ్డి, డాక్టర్ అలేఖ్య, హెడ్మాస్టర్ ఎల్‌వివిఎల్ నరసింహారావు, ప్రిన్సిపాల్ సుధ, వైస్ ప్రిన్సిపాల్ కె.స్పందన, ఏఓ ఆర్.చెంచయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ ఎం.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ వివాదం

# ఆ అయిదుగురిని కమిటీ పొమ్మంది హైకోర్టు ఉండమంది



## కొత్త ఛైర్మెన్‌గా వాకాటి విజయకుమార్‌రెడ్డి
## వైస్‌ఛైర్మెన్‌గా చామర్తి జనార్దన్‌రాజు



వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన నెల్లూరు రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ నుండి అయిదు మందిని జిల్లా కలెక్టర్ తొలగించారు. మంత్రి నారాయణ మీద నెపంపెట్టి ఇప్పటికే అధ్యక్షపదవికి శాసనమండలి సభ్యుడు, వైసీపీ నాయకుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా రాజకీయాలతో సంబంధం ఉన్నవాళ్లు రెడ్‌క్రాస్ మూల కమిటీలో ఉండరాదంటూ కొత్త వివాదాన్ని కొంతమంది తెరపైకి తెచ్చారు. వారి వాదనతో ఏకీభవించిన జిల్లా కలెక్టర్ రాజకీయాలలో చురుకుగా పాల్గొంటున్న అయిదు మందిని కమిటీ నుండి బయటకి పంపించారు. కేవలం మేనేజింగ్ కమిటీ నుండే పంపడం కాకుండా వారి ప్రాథమిక సభ్యత్వం కూడా రద్దు చేశారు. ఛైర్మెన్ పదవికి రాజీనామా చేసిన చంద్రశేఖరరెడ్డితో పాటు యం.వి. (నేతాజి) సుబ్బారెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్న ఆంజనేయులు లని ప్రాథమిక సభ్యత్వం నుండి తొలగించి పక్కకిపెట్టారు.

### సభ్యత్వ రద్దు చెల్లదంటూ హైకోర్టు స్టే!

అయితే, రాజకీయాలకి, రెడ్‌క్రాస్ పదవులకి లింకు పెట్టడం సరికాదని.. ఆ అయిదుగురు తిరగబడ్డారు. రెండూ సేవా రంగాలే కదా అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా రాజకీయాలతో సంబంధం ఉన్న చాలామంది రెడ్‌క్రాస్‌లో కీలక పదవులలో ఉన్నారని వాదించారు. తమ ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసే హక్కు కలెక్టర్‌కి లేదు అంటూ హైకోర్టుని ఆశ్రయించారు. వీరి వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం వారి సభ్యత్వ రద్దు చెల్లదంటూ గురువారం సాయంత్రం స్టే ఇచ్చింది.

ఈలోగా కలెక్టర్ ఆధ్వర్యంలో కొత్త కమిటీ ఎంపిక కూడా జరిగిపోయింది. మేనేజ్‌మెంట్ సభ్యులకి సమాచారం లేకుండా జరిపిన ఎంపిక చెల్లుతుందా లేదా అన్న విషయం రెండు వారాల్లో తేలుస్తామని కూడా హైకోర్టు తీర్పు చెప్పింది. మొత్తానికి రెడ్ క్రాస్ నెల్లూరుజిల్లా విభాగం రాజకీయ రొచ్చుతో రచ్చకెక్కింది.

### కొత్త కమిటీ ఎన్నిక!

చంద్రశేఖరరెడ్డి స్థానంలో కొత్త ఛైర్మెన్‌గా వాకాటి విజయకుమార్‌రెడ్డిని మిగిలిన మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో ఈ ఎంపిక తంతు పూర్తి చేశారు. వైస్‌ఛైర్మెన్‌గా చామర్తి జనార్దన్ రాజుని, కోశాధికారిగా సురేష్‌కుమార్ జైన్‌ని ఎంపిక చేశారు.

మోడరన్ స్కూల్ అధినేతగా, అటు క్యాన్సర్ ఆసుపత్రి, ఇటు టౌన్‌హాల్ కార్య నిర్వాహక సభ్యుడిగా విజయకుమార్‌రెడ్డి జిల్లా వాసులకి సుపరిచితుడే. టీటీడీ ధార్మిక సలహామండలి మాజీ సభ్యుడిగా, అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ సభ్యుడిగా ఆయన ఆధ్యాత్మిక రంగానికి కూడా పరిచయస్తులే. ఇక జనార్దనరాజు కూడా నెల్లూరువాసులకి సుపరిచితుడే. వెంకయ్యనాయుడి శిష్యుడిగా, స్వర్ణభారత్ ట్రస్టు కార్యనిర్వాహక. సభ్యుడిగా ఆయన కూడా సేవా, ధార్మిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటుంటారు. అటు తిరిగి ఇటు తిరిగి రెడ్‌క్రాస్ అధ్యక్ష పదవి విద్యాలయాల నిర్వాహకుల చుట్టూ తిరుగుతుండడం గమనార్హం..!

# 'గగన్‌యాన్'కు.. సిద్ధమవుతున్న ఇస్రో

భారత అంతరిక్ష సంస్థ(ఇస్రో) మొట్టమొదటిసారిగా చేపట్టనున్న మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్' ప్రయోగానికి ఇస్రో శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. రోదసిలోకి వ్యోమగాములను పంపి, మళ్లీ వాళ్లని సురక్షితంగా భూమిపైకి తీసుకొచ్చే బృహత్తర ప్రయత్నంలో ఇస్రో శాస్త్రవేత్తలు తలమునకలై ఉన్నారు. అందుకు అవసరమైన క్రూ మాడ్యూల్‌ను ఈనెల 22న ఒక ప్రత్యేక వాహనంలో శ్రీహరికోటలోని షార్‌కు తీసుకువచ్చారు. బెంగుళూరులోని లిక్విడ్ ప్రొపల్షన్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ)లో ఈ మాడ్యూల్‌కు ప్రొపల్షన్ వ్యవస్థలను అనుసంధానం చేసిన తర్వాత

### షార్‌లో చకచకా ఏర్పాట్లు




షార్‌కు పంపారు. హెచ్‌ఎల్‌వీఎం3(హ్యూమన్ రేటెడ్ లాంచ్ వెహికల్ మార్క్ 3) జీ–1 ద్వారా ఇస్రో రూపొందించిన ఆర్బిటల్ మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు. ఏడు రోజుల తర్వాత దానిని మళ్లీ సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చే ప్రక్రియను చేపడతారు. ఈ ప్రయోగాత్మక ప్రయోగానికి శాస్త్రవేత్తలు అహరహం కృషిచేస్తున్నారు. అంతరిక్షంలోకి పంపిన వ్యోమగాములు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూమిపైకి తిరిగివచ్చేందుకు అనుసరించే అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, దాని పనితీరును నిర్ధారించుకున్న తర్వాత, అన్నీ సరిచూసుకుని వచ్చే ఏడాది మానవ సహిత మిషన్‌ను ప్రయోగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

# చేపలగుంటల్లో కోళ్ల వ్యర్థాలకి..ఇక చెక్!

- ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు
- గ్రామాల్లో ప్రత్యేక కమిటీల ఏర్పాటు

చేపల గుంటల్లో కోళ్ల వ్యర్థాలు వేయకుండా నిరోధించేందుకు ఎట్టకేలకు అధికారులు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో, ఆ అనారోగ్యకర చర్యల నివారణకు అధికారులు ప్రత్యేక కమిటీలు కూడా వేయడం విశేషం. అటు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ, ఇటు జిల్లా కలెక్టర్ సూచనలతో ఈనెల 22న బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, సిబ్బంది సమావేశమయ్యారు. పంచాయతీలవారీగా వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్‌తో కలసి ఒక బృందంగా ఏర్పడి చేపల గుంటల్లో చేపలు సాగుచేస్తున్న రైతులకు అవగాహన కల్పించాలని, చికెన్ వ్యర్థాలు వేసి చేపలు పెంచితే, వాటిని తిన్న ప్రజల ఆరోగ్యానికి ఎంత అనర్థమో వారికి తెలియజెప్పాలని సూచించారు. కుళ్లిన మాంసం, కోళ్ల వ్యర్థాలతో చేపలను పెంచే వారిపై కేసులు పెట్టి కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని కూడా హెచ్చరించారు. ప్రజారోగ్యానికి హానిచేసే ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఎక్కడా అలా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలు పర్యవేక్షించాలని చెప్పారు.

లాయర్
జనవరి 24, 2025

# మహిళా లోకాన్ని కాల్చుకుతింటున్న 'క్యాన్సర్'!

క్యాన్సర్!..క్యాన్సర్!..క్యాన్సర్!...ఇప్పుడు ఎక్కడ విన్నా ఈ మాటే వినిపిస్తోంది. చాలామందిలో క్యాన్సర్ భయం కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి భయంకరంగా విస్తరిస్తోంది. మనదేశంలోనూ క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరిగిపోతున్నాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ఇది విజృంభిస్తోంది. మహిళలు ఈ క్యాన్సర్ పేరు వింటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఏటా లక్షల సంఖ్యలో క్యాన్సర్ మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఒక్క 2023లోనే ప్రపంచంలో 6 లక్షలా 61వేల మంది క్యాన్సర్ కేసులు వచ్చాయని, సుమారు మూడున్నర లక్షల మందిని ఆ వ్యాధి పొట్టనపెట్టుకుందంటూ నిపుణుల గణాంకాలు చెప్తున్నాయి. ముఖ్యంగా మహిళా లోకాన్ని గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) కాల్చుకుతింటోంది. నేటి ప్రపంచానికి ఇదో పెద్ద సవాలుగా పరిణమిస్తోంది. భారత్‌లో గత ఏడాది ఈ గర్భాశయ క్యాన్సర్‌కి సంబంధించి దాదాపు 1.23 లక్షల కేసులు వచ్చాయని, 67వేల మంది ఈ వ్యాధితో మరణించారనే లెక్కలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒక్క గర్భాశయ క్యాన్సర్‌తోనే మనదేశంలో ప్రతి 8 నిమిషాలకి ఒకరు చనిపోతున్నారని నిపుణులు చెప్తున్నారు. అంతేకాదు, రానున్న అయిదేళ్ళలో ఈ తరహా క్యాన్సర్ కేసులు కనీసం మరో 12 శాతం దాకా పెరిగే అవకాశం ఉందంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ క్యాన్సర్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. అనేకమంది మహిళలకు గర్భాశయ క్యాన్సర్ అనేది ఒక పెద్ద సమస్యగా ఉంటోంది. దీన్నే వైద్య పరిభాషలో 'సర్వైకల్ క్యాన్సర్' అంటారు. ఈ వ్యాధి పట్ల సరైన అవగాహన లేకపోవడం, అసలు 'క్యాన్సర్' అనగానే భయపడిపోవడం జరుగుతోంది. దీనిని నివారించడానికి ఎంతో అవకాశం ఉన్నా, ఆ దిశలో స్క్రీనింగ్ పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోకపోవడం, వ్యాధి తీవ్రమయ్యాక ఏం చేయాలో తెలియక నానా అవస్తలు పడుతుండడం జరుగుతోందని వైద్యనిపుణులు అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఇటీవల ఇంటింటా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తే, ప్రతి వంద మందిలో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు తేలింది. రాష్ట్రంలో ఏటా 73వేలకు పైగానే క్యాన్సర్ వ్యాధి కేసులు వస్తున్నట్లు అధికారుల గణాంకాలు చెప్తున్నాయి. ఇప్పటికే ఏటా సుమారు 40వేల మందికిపైగానే ఈ వ్యాధికి బలైపోతున్నారు. తాజాగా సుమారు 53 లక్షల మందికి ఈ పరీక్షలు చేస్తే, అందులో 52వేల మంది క్యాన్సర్‌వ్యాధి అనుమానితులు ఉండడం ఎంతో ఆందోళన కలిగించే విషయం. అందులో దాదాపు 19వేల మంది నోటి క్యాన్సర్, 15వేల మంది రొమ్ము క్యాన్సర్, మరో 17వేల మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాణాంతక వ్యాధిని కట్టడి చేసేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి, వేలాదిమంది వైద్యులు, వైద్య నిపుణులతో..సుమారు 15వేల బృందాలతో రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికపై చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో గత ఏడాది నవంబరు నుండి ప్రారంభమైన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు మరో పది నెలల దాకా జరుగనున్నాయి కూడా.

అసలు క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణం మారిపోతున్న మన జీవనశైలేనంటున్నారు నిపుణులు. మన అలవాట్లే మన కొంప ముంచుతున్నాయి. ఒకప్పుడు 50 ఏళ్ళకు పైబడిన వారిలో వచ్చే క్యాన్సర్ వ్యాధులు ఇప్పుడు చిన్నవయసు నుంచే వస్తున్నాయి. తగినంత శారీరక శ్రమ లేకపోవడం, రోజూ కనీసం ఓ అర్ధగంటైనా వ్యాయామం చేయకపోవడం, అనారోగ్యకరమైన ఆహారం తినడం, యుక్తవయసు రాకముందే వివాహాలు చేసుకోవడం, గర్భనిరోధక మాత్రలు ఎక్కువగా వాడడం, లైంగిక శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వంటివన్నీ గర్భాశయ క్యాన్సర్‌కు కారణమంటున్నారు. అంతేకాదు, బ్రెస్ట్ క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, జీర్ణాశయ క్యాన్సర్‌ల వంటి రకరకాల క్యాన్సర్‌లు పెరిగిపోతున్న నేటిరోజుల్లో మహిళలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు చెప్తున్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్యపరీక్షలు చేసుకోవాలని, ఒకవేళ క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చాయని అనుమానం వస్తే ప్రాథమికదశలోనే తగు చికిత్సలు చేసుకోవడం వల్ల ప్రాణాలకు ముప్పు తప్పుతుందని సూచిస్తున్నారు. క్యాన్సర్ వ్యాధుల పట్ల అవగాహనతో ఉండడం తప్పనిసరి అని చెప్తున్నారు. ఇకనైనా మహిళలు ధైర్యంగా ఉంటూ, ఆ వ్యాధిని నిరోధించేందుకు సంసిద్ధం కావాల్సి ఉంది. వ్యాధి వచ్చాక బాధలుపడేకంటే, ముందుజాగ్రత్తతో ఆరోగ్యపరీక్షలు చేయించుకుంటూ ఆ ముప్పు రాకుండా చూసుకోవడమే అన్ని విధాలా శ్రేయస్కరం!..

# న్యాయస్థాన ప్రాంగణాలలో సైతం బహిరంగ ధూమపానం!

బహిరంగ ధూమపానం చట్టరీత్యా నేరం. కానీ, ధూమపాన ప్రియులలో ఆ భయం ఎక్కడా కనిపించడంలేదు. రైల్వే స్టేషన్లలో, బస్‌స్టాండుల్లో, టీ బంకుల వద్ద బహిరంగంగా సిగరెట్లు కాలుస్తూనే ఉన్నారు. కొంతమంది ఓ మెట్టు దాటి న్యాయస్థానాల ప్రాంగణాలలో సైతం దర్జాగా దమ్ము కొడుతున్నారు. పబ్లిక్ ప్రదేశాలలో పొగత్రాగుతున్న వారిని పోలీసులు కూడా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. కొన్ని చోట్లయితే యూనిఫారంలో ఉన్న పోలీసులే సిగ్గు విడిచి పబ్లిగ్గా పొగ పీల్చేస్తున్నారు. బహిరంగ ధూమపానం పట్ల నిషేధం ఉన్నప్పటికీ, అది అమలవుతున్న దాఖలాలు కనపడడం లేదు. దేశంలో క్యాన్సర్ బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోందని ఇటీవల కొన్ని సర్వేలు స్పష్టం చేశాయి. అయినా, ఇలా నిస్సిగ్గుగా బహిరంగ ధూమపానం చేసేవారి శాతం తగ్గడం లేదు. ఈ విషయంలో చట్టాలు మరింత కఠినతరం చేసి చర్యలు చేపడితే తప్ప మార్పు కష్టమేనేమో!? " పొగత్రాగని వాడు దున్నపోతై పుట్టున్" అన్న మాటకి బదులుగా "బహిరంగ ధూమపానం చేసిన వాడు పందై పుట్టున్" అన్న మాటని ప్రచారంలోకి తెస్తే బాగుంటుంది.

ఆర్.పి. రామయ్య
కొండాయపాలెం, నెల్లూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# తిరుమలలో వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లు అద్భుతం!

ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 10వ తేదీ నుండి 19వ తేదీ వరకూ తిరుమలలో కల్పించిన వైకుంఠ ద్వార దర్శనం నభూతో న భవిష్యత్. ఏటా పది రోజులపాటు భక్తులకి వైకుంఠద్వార దర్శనం కల్పించడం అన్నది మంచి నిర్ణయం. ఆ నిర్ణయం ఏ ప్రభుత్వం తీసుకున్నా అది ఆమోదయోగ్యం, సమర్ధనీయం. ఈ విషయమై అర్ధరహిత వివాదం అనవసరం. ఈసారి టీటీడీ చేసిన ఏర్పాట్లు అద్భుతం. ముఖ్యంగా గతంలో తిరుమలలో ఎప్పుడూ చూడనంత ఘనంగా ఈసారి పుష్పాలంకరణ చేశారు. భక్తులకి స్వామివారి దర్శన ఏర్పాట్లు కుడా పకడ్బందీగా చేశారు. భక్తులకి ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూశారు. ఈ పదిరోజులపాటు వీలయినంతమంది సామాన్య భక్తులు స్వామివారిని దర్శించుకుని వైకుంఠ ద్వారం ద్వారా బయటకి వచ్చే సౌలభ్యం కల్పించారు. గతంతో పోలిస్తే ఈసారి దర్శనం అత్యంత ప్రశాంతంగా జరిగిందని వేలాదిమంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. టోకెన్ల పంపిణీల సమయంలో జరిగిన అపశృతి అత్యంత బాధాకరం. ఆ ఒక్క సంఘటన జరగకుండా ఉంటే.. ఈసారి వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లు, దర్శనం జరిగిన సరళి చరిత్రలో నిలిచిపోయేవి. అధికారుల అలసత్వంవల్ల తొక్కిసలాట జరిగి ఆరుమంది అశువులు బాయడం దురదృష్టకరం. ఓం నమో వేంకటేశాయ నమః...!

- లక్ష్మీ భరద్వాజ్ - హైదరాబాదు.




# మధ్యతరగతి బ్రతుకు భారం.. చిరునవ్వు దూరం!

జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, అన్నిటినీ భరించి సర్దుకుని జీవితాన్ని ఎదురీదే వాళ్ళెవరైనా వున్నారంటే అది ఖచ్చితంగా ఒక్క మధ్య తరగతి కుటుంబమే అని చెప్పక తప్పదు. అయితే, రానురాను వారి పెదవులపై ఆ చిన్న చిరునవ్వు కూడా మాయమైపోతోంది. దేశంలో రూపాయి విలువ పడిపోయి, ఖర్చులు పెరిగిపోయి, అప్పులు పేరుకుపోయి మధ్యతరగతి కుటుంబాల జీవితాలు అంధకారంలో కూరుకుపోతున్నాయి. చిన్న చిన్న అవసరాలను కూడా తీర్చుకోలేని దుస్థితి ఏర్పడింది. పట్టణాలు, నగరాలు, చివరికి గ్రామాల్లో కూడా ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుండడంతో విఫణివీధిలో క్రయవిక్రయాలు గణనీయంగా పడిపోతున్నాయని వ్యాపారవర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

## వ్యవస్థలు ఉన్నా అవస్థలు తప్పడం లేదు!

మన దేశంలో ఆర్థికవ్యవస్థ వుంది. ఆ వ్యవస్థ కోసం అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రాలలో ప్రత్యేక శాఖలు ఉన్నాయి. రాజకీయపరంగా మంత్రులు ఉన్నారు. ప్రత్యేక అధికార యంత్రాంగం పనిచేస్తుంది. ఇంతటిస్థాయిలో వాళ్ళందరూ పని చేస్తున్నప్పటికీ మధ్యతరగతి కుటుంబాల బాధలు తీరడంలేదు. నిజానికి చెప్పాలంటే దేశంలో ఎక్కువశాతం పన్నులు చెల్లించేది మధ్యతరగతి ప్రజలే. ఏళ్ళతరబడిగా ప్రభుత్వాలు మారుతున్నాయి. పాలకులు మారుతున్నారు. వ్యవస్థలలో మార్పులు సంభవిస్తున్నాయి. సమాజంలో పరిస్థితులు కొత్త మార్పులు సంతరించుకుంటున్నాయి. అయినా మధ్య తరగతి కుటుంబాల తలరాతల్లో మాత్రం ఎలాంటి మార్పులు రావడంలేదు. నానాటికీ పెరుగుతున్న కష్టాలను భరించలేక, కుటుంబాలను సరిగా పోషించుకోలేక, అటు గొప్పగా బతకలేక.. ఇటు బీదగా జీవించలేక మధ్యలో నలిగిపోతున్నారు మధ్య తరగతి ప్రజలు.

## కోట్లాది మంది వేతనజీవుల బాధలు వినేవారే లేరు

దేశంలో నిరుపేదలు, పేదలు, బడుగు బలహీనవర్గాల ప్రజలతో సమానంగా మధ్యతరగతి వారు కూడా కోట్లసంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వ రంగంలో వివిధ శాఖలలో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో పాటు ఇతరత్రా అనేక ప్రైవేట్ కార్యాలయాల్లో నెలవారీ జీతాలతో పనిచేసే వారు కూడా లెక్కకిమించే ఉన్నారు. అయితే, పన్నుల చెల్లింపులో శ్రీమంతులకి లభించే రాయితీలు మధ్యతరగతి వారికి వర్తించడంలేదన్న విమర్శ సర్వత్రా వ్యక్తమవుతోంది. పన్నుల వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండడమే అందుకు ప్రధాన కారణమనే ఆరోపణలూ వున్నాయి.

ఆదాయ పన్నును పక్కనపెడితే మనిషి నిద్ర లేచిన దగ్గర నుండి వాడే ప్రతీ వస్తువుపైనా పన్ను విధిస్తున్నారు. వివిధ పన్నులరూపంలో ఖర్చులన్నీ పోను కొద్దో గొప్పో పొదుపు చేసుకుంటే మళ్ళీ దానికి ఆదాయ పన్నులంటూ నడుము విరగ్గొడుతున్నారు. పన్నులు ఎగ్గొట్టేవారిని గాలికి వదిలేసి సక్రమంగా పన్నులు కట్టే వారిపైనే మరింత భారం వేసి బలవంతపు వసూళ్ళు చేస్తున్నారు. ప్రభుత్వాలకి పంగనామం పెట్టే ఆర్థిక నేరగాళ్ళు, పన్ను ఎగవేత దారులు, పన్ను పరిధిలోకిరాని నిరుపేదలు హాయిగా జీవిస్తున్నారు. మధ్యలో మధ్యతరగతి వాళ్ళే బలైపోతున్నారు. నిజాయితీగా బ్రతకడం, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు క్రమం తప్పకుండా కట్టడం, మిగిలిన దాంతోనే బ్రతుకుసాగించడం మాత్రమే మధ్యతరగతి కుటుంబాలవారికి తెలుసు. కాబట్టే, వారి బ్రతుకులు ఎదుగూబొదుగూ లేకుండా వున్నాయి.

## ధరలు పెరిగి.. జీవనం భారమవుతోంది

"అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి" అన్నట్లుగా అన్ని రకాల వస్తువుల ధరలు పెరగడంతో, మధ్యతరగతి కుటుంబాలు పెరుగుతున్న ధరలకు తగ్గట్లుగా బ్రతకలేక, తమ ఖర్చులను తామే తగ్గించేసుకుంటున్నాయి. జీవన వ్యయం భారమవుతుండడంతో అందుకు మరో ప్రత్యామ్నాయం వెతుక్కుంటున్నాయి. "దుప్పటి ఉన్నంతవరకే... కాలు ముడుక్కోవాలి" అన్నట్లుగా తమ సంపాదనకి తగ్గట్లుగానే బతుకు సాగిస్తున్నాయి. చాలా కుటుంబాలలో కొనుగోలుశక్తి తగ్గిపోతోందని, నిత్యావసరాలను సైతం చాలినంతగా కొనలేక అల్లాడిపోతున్నారని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

గతంలో సంపాదనలో అధికమొత్తాన్ని కేవలం నిత్యావసరాలకే వెచ్చించేవారు, ఇప్పుడు మార్కెట్‌లో ధరలు చూసి గుడ్లు తేలేస్తున్నారు. ఏ వస్తువు చూసినా సామన్యులు కొనలేనంత స్థాయికి వాటి ధర పెరిగిపోతోంది. ఇక బతికేదెలా?.. అని వాపోతున్నారు. వాటిని కొనలేక ప్రజలు తమను తాము కుదించుకుంటున్నారు. పెరుగుతున్న ధరల వల్ల ప్రైవేట్ రంగంలో కూడా ఆదాయ శాతం తగ్గింది. ఈ పరిస్థితులలో ప్రైవేట్ రంగంలో జీతాలు కూడా ఆశించినంతగా పెరగడం లేదు.

## రానున్న బడ్జెట్‌పైనే ఆశలన్నీ

దేశవ్యాప్తంగా వ్యక్తిగత పన్నులు చెల్లించేవారు కోటానుకోట్ల మంది ఉన్నారు. అయినా, ఆ పన్నులు కట్టే ప్రజలకు మాత్రం ఎలాంటి సదుపాయాలు ఉండడం లేదు. దేశంలో పన్నుల ద్వారా వచ్చే భారీమొత్తాలతో పెట్టుబడిదారుల భోషాణాలు నిండుతున్నాయే తప్ప, ప్రజలకు విద్య, వైద్యం, ఇతరత్రా మౌలిక సదుపాయాల కల్పన కూడా ఆశాజనకంగా ఉండడం లేదన్నదే సర్వత్రా వ్యక్తమవుతున్న ఆవేదన. పేద ప్రజలకి ఇచ్చే రాయితీలు పొందే అర్హతలేక, పన్నుల నుండి మినహాయింపు లేక, అవి చెల్లించే స్తోమత లేక, నిధులు కరువై బ్రతుకు బరువై కోట్ల కుటుంబాలు కుమిలిపోతున్నాయి. మధ్యతరగతి ప్రజలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉండాలి. తద్వారా మిగిలే మొత్తం కొనుగోళ్ళ ద్వారా మార్కెట్లోకి వస్తుంది. ఆవిధంగా ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి పన్ను రాయితీలను మరోసారి పునరాలోచించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్ వైపే మధ్యతరగతి కుటుంబాల వారు కోటి ఆశలతో చూస్తున్నారు. పన్నుల విధానాన్ని ఇకనైనా సంస్కరించి, చీకటిలో మగ్గుతున్న సాధారణ జీవితాలలో కొత్త వెలుగులు ప్రసరించేలా చూస్తారని ఆశపడుతున్నారు. వారి కలలు ఫలించాలని, మధ్యతరగతి కుటుంబాల జీవితాలు మారాలని మనసారా ఆశిద్దాం!..

- రాజశ్రీ

### ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా..

# శ్రీసిటీలో ప్రత్యేక సదస్సులు

## ప్రకృతి పరిరక్షణ కోసం ఏటా కోటి వెచ్చిస్తామన్న శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి




ప్రకృతి పరిరక్షణ కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమం కింద శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం తరపున ఏటా కోటి రూపాయలు వెచ్చిస్తామని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు. ఈనెల 18న సూళ్ళూరుపేట ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభమైన ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సుస్థిర భవిష్యత్తు కోసం మన దృక్పథానికి అనుగుణంగా పులికాట్ సరస్సు వంటి సంపదను కాపాడుకోవడానికి సమిష్టి కృషి అవసరమని, అందుకు ఫ్లెమింగో ఫెస్టివల్ ఉపకరిస్తుందని ఆయన చెప్పారు. తొలుత, శ్రీసిటీ ప్రగతిని ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ పాల్గొనడం సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ పట్ల శ్రీసిటీ నిబద్ధతకు నిదర్శనం అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్లు అభినందించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్పొరేట్ సామాజిక బాధ్యత సదస్సులో.. కార్పొరేట్ చొరవ ద్వారా పర్యావరణ నిర్వహణ, సామాజిక స్పృహ అనే అంశాలను చర్చించారు. ప్రకృతి పరిరక్షణ పట్ల శ్రీసిటీ నిబద్ధతతో ఉందని, ఇక్కడ కేవలం హరిత పరిశ్రమలను మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు తెలిపారు. బీఎన్‌హెచ్‌ఎస్ స్ఫూర్తితో తిరుపతి నేచర్ సొసైటీని స్థాపించి ప్రాంతీయ జీవవైవిధ్యాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సి.సెల్వం, బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్) డా. సత్య సెల్వం, బీఎన్‌హెచ్‌ఎస్ డైరెక్టర్ డాక్టర్ కిషోర్ రితే, వివిధ పరిశ్రమల ఉన్నతాధికారులు పాల్గొని సమిష్టిగా వివిధ కీలక అంశాలపై చర్చించారు. అనంతరం పలు పరిశ్రమల యాజమాన్యాలకు, వారి అధికారులకు జ్ఞాపికలను బహుకరించారు.

## 24 నుంచి..రామాయణ ప్రవచనాలు

పద్య సారస్వత పరిషత్–నెల్లూరుశాఖ వారు ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు 'శ్రీ రామాయణ ప్రవచనాలు' కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నారు. స్థానిక బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలో ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఈ ప్రవచనాలుంటాయని నిర్వాహకులు తెలిపారు. 24న అవధాని కోట రాజశేఖర్, 25న విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు, 26న డా.కె.గిరిజాలక్ష్మి, 27న విశ్రాంత అధ్యాపకులు పోలవరపు లక్ష్మీనరసింహరావు, 28న విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు, 28న శతావధాని కొండెపి మురళీకృష్ణ, 30న అధ్యాపకులు డా. ఐనవోలు చక్రపాణి, 31న పద్యకవి డా. శింగరాజు శ్రీరామకృష్ణప్రసాదరావు పాల్గొని రామాయణంలోని వివిధ అంశాలను విశదీకరిస్తారని పేర్కొన్నారు. తొలిరోజున శ్రీ సీతారామస్వామి మందిరం అధ్యక్షులు తన్నీరు మస్తాన్‌రావు సభను ప్రారంభిస్తారని, ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీహరితీర్థస్వామి, సింహపురి ధార్మికసంస్థ వ్యవస్థాపకులు ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, మురారిశెట్టి తిరుపతిస్వామి తదితరులు పాల్గొంటారని, సారస్వతాభిమానులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పద్య సారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, ప్రధాన కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వరరావు, కోశాధికారి సూరం చంద్రశేఖరం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



## ఆత్మకూరులో.. ఎన్టీఆర్ వర్ధంతి

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరు నియోజకవర్గంలో ఈనెల 18న ఆయన సూచనల మేరకు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను వాడవాడలా నిర్వహించారు. ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను, ఎన్టీఆర్ సేవలను స్మరించుకుంటూ అభిమానులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను ఆత్మకూరుతో పాటు, అన్ని మండల కేంద్రాలలో పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఆత్మకూరులోని జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో రక్తదాన శిబిరం మరియు అన్నదాన కార్యక్రమాలు చేశారు. అనంతసాగరం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం మరియు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. చేజర్ల మండలం నాగులవెల్లటూరులోని ఎన్టీఆర్ భవన్‌లో రక్తదాన శిబిరం మరియు అన్నదాన కార్యక్రమాలు చేశారు. మర్రిపాడు మండలం తిక్కవరం గ్రామంలో, మర్రిపాడు మండలం చిన్నమాచనూరు గ్రామాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం, అన్నదానం చేశారు. ఆత్మకూరు, సంగం, ఏఎస్‌పేట, చేజర్ల తదితర ప్రాంతాల్లో అన్నదానాలు, రక్తదానాలు చేసి ఎన్టీఆర్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

## కలెక్టరేట్‌లో వేమన జయంతి



సరళమైన పద్యాల ద్వారా వ్యవహారిక తెలుగు భాషలో జీవిత సత్యాలను తెలిపిన గొప్ప తత్వవేత్త, ప్రజాకవి యోగివేమన జయంతి కార్యక్రమం ఈనెల 19న నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి జె. ఉదయ భాస్కరరావు పాల్గొని యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యం, ధర్మం సమానత్వం, మానవతా విలువలు, సామాజిక సమస్యలను తమ పద్యాల ద్వారా ఎలుగెత్తి చాటిన గొప్పకవి యోగి వేమన అని డీఆర్ఓ కొనియాడారు. అనంతరం, అనంతసాగరం మండలం చిలకలమర్రి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు నిహారిక, సాయి భార్గవి, శంకర్ తదితరులు వేమన పద్యాలను వీనుల విందుగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అద్భుతాలు... నెల్లూరోళ్ళ "సిత్రాలు"

## • అందరినీ ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన









అవి రేఖాచిత్రాలా, వర్ణచిత్రాలా,తంజావూరు దేవతామూర్తుల చిత్రాలా..మ్యూరల్ చిత్రాలా, డాట్ వర్ణచిత్రాలా, కాఫీపొడినే పెయింట్‌గా చేసి గీసిన చిత్రాలా, ఏదైతేనేం అన్నీ చేయితిరిగిన చిత్రకారులు వేసినవే. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు నెల్లూరు టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో ఏర్పాటుచేసిన చిత్రకళా ప్రదర్శనలోని అన్ని చిత్రాలు వేటికవే ప్రత్యేకతగా ఉండి అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రకృతి చిత్రాలు, శ్రీ వేంకటేశ్వరుడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు తదితర దేవతామూర్తుల చిత్రాలు, ఇంకా అనేక రకాలైన అద్భుత చిత్రకళాఖండాలు మన నెల్లూరు చిత్రకళాకారుల కుంచెల నుంచి జాలువారినవే కావడం విశేషం. ప్రముఖ చిత్రకారిణి నెల్లూరు అన్నపూర్ణ రూపొందించిన 'శ్రీ వేంకటేశ్వరస్వామి' తదితర దేవతామూర్తుల చిత్రాలు, ప్రముఖ చిత్రకారుడు అమీర్‌జాన్ వేసిన రైతుబిడ్డగా ఎన్టీఆర్ చిత్రం, మున్నం సుందరబాబు వేసిన దానవీరశూర కర్ణ చిత్రంలోని ఎన్టీఆర్ చిత్రం, దోర్నాల శేషయ్య వేసిన 'అల్లూరి సీతారామరాజు' వంటి చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా ప్రముఖ చిత్రకారిణి వంజవాక లక్ష్మీసన్నిహిత వేసిన పరమశివుని చిత్రం, ఎం. బాలకృష్ణ గీసిన శ్రీకృష్ణుని చిత్రాలు, కాఫీపొడితో విలక్షణమైసన రీతిలో గుర్రం శ్రీనాథ్ ' వేసిన చిత్రాలు, కె. సునీతారవి మ్యూరల్ ఆర్ట్ చిత్రాలు..ఒక్కొక్కటీ ఒక్కో అద్భుతమనే చెప్పాలి. ఎన్టీఆర్ శతజయంతి మరియు సినీ వజ్రోత్సవం సందర్భంగా 'కలర్స్ ఆఫ్ నెల్లూరు' ఎడిషన్–3 పేరుతో ఏర్పాటుచేసిన ఈ చిత్రకళా ప్రదర్శనను రోజూ వందలాదిమంది కళాభిమానులు, వివిధ పాఠశాలలకు, కళాశాలలకు చెందిన విద్యార్థులు తిలకించి ఆనందించారు. తొలిరోజు ఈ ప్రదర్శనను అమరావతి కృష్ణారెడ్డి ప్రారంభించగా, అనంతరం ఎన్టీఆర్ వీరాభిమాని తాళ్లపాక రమేష్‌రెడ్డి వచ్చి ఎన్టీఆర్ చిత్రాలను చూసి మురిసిపోయారు. చిత్రకారులను ప్రజలు, ప్రముఖులందరూ అభినందించారు.








# 'స్వచ్ఛాంధ్ర' సాధనే..అందరి లక్ష్యం కావాలి

## ఎంపీ వేమిరెడ్డి పిలుపు




రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛాంధ్ర సాధనే అందరి లక్ష్యం కావాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు ఈనెల18న 'స్వచ్ఛదివస్' కార్యక్రమంలో భాగంగా నెల్లూరులో జరిగిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలసి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో భాగస్వాములు కావాలని, పరిసరాల పరిశుభ్రతలో మనం అగ్రగాములుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పరిశుభ్రతలో ముందుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆయనన్నారు. తొలుత, నగరంలోని వీఆర్‌సి సెంటర్ నుంచి గాంధీ విగ్రహం కూడలి వరకు ర్యాలీ జరిగింది. గాంధీజీ విగ్రహానికి విపిఆర్, కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర సాధన సాధ్యమవుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. ఆమేరకు అందరితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, డిప్యూటి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, జనసేన నాయకుడు నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా నేతగా.. మళ్ళీ వంశీధర్‌రెడ్డి



బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడిగా రెండోసారి శీపా వంశీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈనెల 21న నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గోపి శ్రీనివాస్, వల్లూరు జయప్రకాష్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో వంశీధర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. మొత్తం 11 మంది ఆ పదవికోసం నామినేషన్లు వేసినా అధిష్టానం వంశీధర్‌రెడ్డి వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. ఎన్నికల అనంతరం వంశీధర్‌రెడ్డిని నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో సన్మానించారు. పార్టీ శ్రేయస్సుకోసం పాటుపడతానని, జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం కృషిచేస్తానని వంశీధర్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. బీజేపీ జిల్లా నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రామకృష్ణమిషన్ ఆధ్వర్యంలో..

# స్వామి వివేకానంద జయంతి

నెల్లూరు, నవలాకులతోట మూడవమైలులోని రామకృష్ణమిషన్‌లో ఈనెల 22న స్వామి వివేకానంద జయంతి ఘనంగా జరిగింది. మిషన్ కార్యదర్శి స్వామి హృదానందజీ మహారాజ్ పాల్గొని, శ్రీ వివేకానంద స్వామివారి బోధనలను వివరించారు. ఈ సందర్భంగా ఉదయం 7.30 గంటల నుంచి హోమం, భజనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరిగాయి. ప్రముఖ మూత్రపిండ వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం.మోహన్‌రాజు స్వామి వివేకానంద జీవితచరిత్రను వివరించారు. స్వామీజీ ఆశీర్వచనాలతో కార్యక్రమం జయప్రదంగా జరిగింది. టీ.లక్ష్మీనారాయణ ఆశ్రమ ట్రస్ట్, స్వామి గోపీనాథానందపురి, జి.జయచంద్ర పాల్గొన్నారు. సుమారు 70మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# నెల్లూరు కబుర్లు

## రోడ్డు ప్రమాదాలు జరగకుండా..

# గట్టి చర్యలు చేపట్టండి

## అధికారులకు కలెక్టర్ ఆదేశం




రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడేందుకు అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఈనెల 21న కలెక్టరేట్‌లో జరిగిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తరచూ ప్రమాదాలు జరిగే సుమారు 50 ప్రాంతాల్లో, ఇక ప్రమాదాలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. రవాణా శాఖ ఉప కమిషనర్ (డీటీసీ) చందర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు తాము చేపడుతున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జనవరి 16 నుండి ఫిబ్రవరి 16వరకు జరుగుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని కలెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ తదితర అధికారులతో కలసి మెగా ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఏఎస్పీ సౌజన్య, ఆర్టీఓలు శ్రీచందన, సుధాకర్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఏ పీడీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాత అజయ్.. 111వ సారి రక్తదానం



నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్‌సెంటర్ కన్వీనర్, రక్తదాత సిహెచ్ అజయ్‌బాబు ఒక రోగి అత్యవసరం కోసం ఈనెల 21న రక్తదానం చేశారు. ఇది తన 111వ రక్తదానమని ఆయన తెలిపారు. అత్యవసర సమయంలో నిరుపేద బాధితులకు రక్తం దానం చేసేందుకు యువత ముందుకు రావాలని, రక్తదానం చేయడమంటే ఒకరికి ప్రాణదానం చేయడమేనని ఆయన ఈ సందర్భంగా యువతకు పిలుపునిచ్చారు. రెడ్ క్రాస్ బ్లడ్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యస్. వరప్రసాద్, రెడ్ క్రాస్ మెడికల్‌షాప్ కన్వీనర్ యు.మురళీకృష్ణ, మహాయాగ హెల్పింగ్ హాండ్ ప్రెసిడెంట్ పురాణం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆళ్వార్‌దాస్ వర్ధంతి



వాకర్స్ ఉద్యమస్ఫూర్తి, వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆళ్వార్‌దాస్ 22వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 20న నెల్లూరులో ఘనంగా జరిగింది. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాబోలు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వాకర్స్ పాల్గొని ఆళ్వార్‌దాస్ సేవలను కొనియాడారు. తొలుత ఆళ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1986లో విశాఖలో స్నేహితులతో ప్రారంభమైన వాకర్స్ ఉద్యమం ప్రస్తుతం అంతర్జాతీయస్థాయికి ఎదిగి, సుమారు 1600 వాకర్స్ క్లబ్‌లతో ప్రఖ్యాతిగాంచిందని, నడక ఆరోగ్యానికి దివ్యౌషధమంటూ ఎంతోమందికి నడక పట్ల ఆసక్తి కలిగిస్తోందని, ఆరోగ్యపరిరక్షణలో నడక ఎంతో ప్రాధాన్యత వహిస్తూ, వాకర్స్ సేవా కార్యక్రమాలకు కూడా వేదికగా మారిందని పలువురు వాకర్స్ ఈ సందర్భంగా ఆళ్వార్‌దాస్ సేవలను గుర్తుచేసుకున్నారు. వాకర్స్ ప్రతినిధులు టి.సురేష్‌కుమార్, వింజం రమానాయుడు, వేలూరు రంగారావు, నలుబోలు బలరామయ్య నాయుడు, కిలారి తిరుపతినాయుడు, దాసరి అనంతరామారావు, అరిగెల సాయి, కెవిఎన్‌వి ప్రసాద్, విజయరాఘవేంద్ర, కె.శ్రీధర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాల సృష్టికర్త ఎన్టీఆర్

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

తెలుగుజాతి కీర్తి ప్రతిష్టలను ప్రపంచం నలుదిశలా ఎలుగెత్తి చాటిన కారణజన్ముడు, సంక్షేమ పథకాల సృష్టికర్త..'అన్న ఎన్టీఆర్' అంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఇటీవల రూరల్ నియోజకవర్గం పరిధిలోని 33వ డివిజన్..పొదలకూరురోడ్డులో ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా.. ప్రజా నాయకునిగా ఎన్టీఆర్ పేదప్రజలకు చేసిన సేవలను, అమలుచేసిన పలు పథకాలను వివరించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు.. మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారకరామారావు అంటేనే ఒక చరిత్ర అంటూ కీర్తించారు. నాయకులు మన్నెం పెంచలనాయుడు, కరణం హజరత్‌నాయుడు, బుజ్జయ్యనాయుడు, రమేష్‌నాయుడు, అనంతనేని బాబు, శ్రీనివాసులు, బలరాం నాయుడు, నాని, రాజేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుకు కొత్త డీఎస్పీ



నెల్లూరు నగరానికి కొత్త డీఎస్పీగా పి.సింధుప్రియ ఈనెల 20న బాధ్యతలు చేపట్టారు. గ్రూప్-1 అధికారిగా ఎంపికైన ఆమె డీఎస్పీగా తొలి పోస్టింగ్ నెల్లూరు నగరానికి రావడం విశేషం. నెల్లూరులోని డీఎస్పీ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ, శాంతి భద్రతలకు భంగం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, నేరాల నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని ఆమె కోరారు. ఎలాంటి సమస్యలున్నా ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అనంతరం ఆమె జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పలువురు ఎస్ఐలు కొత్త డీఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం.. కోటీ 11 లక్షలు

సంక్రాంతి పండుగలు నెల్లూరు ఆర్టీసీ రీజియన్‌కు భారీ ఆదాయం తెచ్చిపెట్టాయి. దూరప్రాంతాల ప్రయాణీకుల కోసం ప్రత్యేక బస్సులు నడపడంతో ఈనెల 9 నుంచి 19వతేదీ వరకు, ఈ 10రోజుల్లోనే కోటీ 11 లక్షల 66వేల 421 రూపాయల రాబడి వచ్చినట్లు ఆర్టీసీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

## 'హరివిల్లు' హరిబాబుకి..

# 'కృష్ణంరాజు అవార్డు'




నెల్లూరుకు చెందిన ప్రముఖ రంగస్థల, సినీ, టీవీ హాస్యనటుడు, 'హరివిల్లు' హరిబాబుగా ప్రసిద్ధిచెందిన దోర్నాల హరిబాబుకు విశిష్ట ప్రతిభా పురస్కారం లభించింది. ప్రముఖ సినీనటుడు కృష్ణంరాజు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి కళావేదికలో ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్‌ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగిన కార్యక్రమంలో హరిబాబుకు కృష్ణంరాజు ప్రతిభా పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. తెలంగాణ శాసనసభ్యులు రామచంద్రనాయక్, ప్రముఖ గజల్ గాయకుడు శ్రీనివాస్, సినీనటుడు కృష్ణుడు, గౌతం రాజు తదితరుల చేతుల మీదుగా ఆయన ఆ పురస్కారాన్ని అందుకున్నారు.




# తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన ఎన్టీఆర్

## -వర్ధంతి సభలో ఎంపీ వేమిరెడ్డి



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసి, తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింప జేశారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. ఈనెల 18న నటరత్న నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా, నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితర నాయకులతో కలిసి ఆయన పాల్గొని, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఎన్టీఆర్ అంటే ప్రజలకు ఎంతో అభిమానమని, ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలకు ఆయన ఆద్యులని వేమిరెడ్డి ఈ సందర్భంగా ప్రశంసించారు. దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్‌తన ప్రత్యేకతను చాటుకున్నారని, ప్రజల కోసం ఆయనెన్నో బృహత్తరమైన కార్యక్రమాలు చేపట్టి ప్రజాభిమానం పొందారన్నారు. అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, నాడు జిల్లాలో ఎన్టీఆర్ ప్రారంభించిన తెలుగుగంగ పథకం నేటికీ లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తోందని, ఎన్టీఆర్ సేవలు అపారమని కీర్తించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జడ్.శివప్రసాద్, జన్ని రమణయ్య, మహిళా నాయకురాలు తాళ్లపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లెమింగో ఫెస్టివల్ ముగింపు వేడుకల్లో..

# రవీంద్ర సన్నారెడ్డికి మంత్రి సత్కారం!



సూళ్లూరుపేట జూనియర్ కాలేజీ మైదానంలో జరిగిన మూడు రోజుల పక్షుల పండుగ ముగింపు సందర్భంగా ఈనెల 21న జరిగిన వేడుకలలో రాష్ట్ర రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ నుంచి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఘనసత్కారం అందుకున్నారు. పండుగ నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించిన రవీంద్ర సన్నారెడ్డిని మంత్రి జ్ఞాపికతో సత్కరించారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, సిఎస్ఆర్, జీవ వైవిధ్యం వంటి అంశాలపై పారిశ్రామికవర్గాలు, నిపుణులతో శ్రీసిటీలో జయప్రదంగా సదస్సులను నిర్వహించడంపై రవీంద్ర సన్నారెడ్డిని మంత్రి అభినందించారు. ఫ్లెమింగో పండుగ నిర్వహణలో శ్రీసిటీ సహాయసహకారాలు మరువలేనివంటూ ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డా.వెంకటేశ్వర్ కొనియాడారు. అనంతరం మంత్రికి, జిల్లా కలెక్టర్‌కు డాక్టర్ సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సుస్థిర పారిశ్రామిక వృద్ధి, పర్యావరణ నిర్వహణకు శ్రీసిటీ కట్టుబడి ఉంటుందని, జీవవైవిధ్యం పట్ల ప్రజల బాధ్యతను పెంపొందించడానికి ఈ పక్షుల పండుగ ఒక ప్రత్యేకమైన వేదికగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ ఎన్.విజయశ్రీ, సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, బొజ్జల సుధీర్, కురుగుండ్ల రామకృష్ణ, పాశిం సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాల్లో తొలి ప్రాధాన్యత గిరిజనులకే!

## - మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



ఇళ్ల నిర్మాణాల్లో తొలి ప్రాధాన్యత గిరిజనులకే ఇస్తామని, అమాయకులైన గిరిజనుల సంక్షేమంపై అధికారులు దృష్టిపెట్టాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ముత్తుకూరు మండలంలోని సచివాలయ ఉద్యోగులతో ఇటీవల ఫిషరీ కాలేజ్ ఆడిటోరియంలో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డులు కూడా లేని స్థితిలో గిరిజనులు ఉండటం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు, కనీసం ఆ నిరుపేదల అవసరాలు తెలుసుకోలేరా?.. అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్న వారిని గుర్తించలేరా? అని ఆయన ప్రశ్నించారు. సమాజంలో అత్యంత అమాయకులు, నిరక్షరాస్యులు అయిన గిరిజనులతో పాటు దళితులు, పేదలందరిపై సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి సారించి వారి అభివృద్ధికి కృషిచేయాలని చెప్పారు. పేదలకు ఇళ్ల స్థలాల మంజూరుకు కూడా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇకపై పేదలకు 18 అంకణాల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కూడా ఆయన చెప్పారు. అనర్హుల గుప్పెట్లో ఉన్న స్థలాలను స్వాధీనం చేసుకుని న్యాయంగా, రాజకీయాలకు అతీతంగా వాటిని పేదలకు పంపిణీ చేస్తామన్నారు.

# ఉదయగిరి యువతకు శుభవార్త!

## ఫిబ్రవరిలో కాకర్ల ఆధ్వర్యంలో జాబ్‌మేళా

ఉదయగిరి నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సుమారు 50 కంపెనీల ప్రతినిధులను జాబ్‌మేళాకు ఆహ్వానించేందుకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషిచేస్తున్నారు. ఐటి, మాన్యుఫాక్చరింగ్, టెక్ సపోర్ట్, బీపీఓ, మార్కెటింగ్ వంటి వివిధ రంగాలలో ఉద్యోగాల భర్తీ కోసం ఈ మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. అంతేకాదు, యువతకు ఇంటర్వ్యూలలో సులువుగా విజయం సాధించేందుకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు ఇంటర్వ్యూ ఫేసింగ్ టెక్నిక్స్‌పై వింజమూరులో 5 రోజుల శిక్షణ కార్యక్రమం (గ్రెడెన్స్ ప్రోగ్రాం) ఏర్పాటు చేసేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. పదవ తరగతి నుంచి పీజీ చదివిన వారి వరకు, లేదా ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునని నిర్వాహకులు చెప్పున్నారు. బొమ్మరాజుచెరువులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వేదికగా జరిగే ఈ జాబ్ మేళాని ఉదయగిరి యువత సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 79897 22341, 97014 87419 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వారు కోరుతున్నారు.

# మీ విజయం.. భావితరాలకు స్ఫూర్తిదాయకం

## క్రీడాకారులను అభినందించిన వేమిరెడ్డి దంపతులు

అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో ప్రపంచ కప్ సాధించి గ్రామీణ క్రీడాకారులకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన భారత పురుష మరియు మహిళా జట్లను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు. ఇటీవల ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ టోర్నీలో పురుషుల మరియు మహిళా విభాగాలలో ప్రపంచ కప్ సాధించి భారత ఖోఖో క్రీడాకారులు అరుదైన రికార్డు సృష్టించారు. ఆ క్రీడాకారులు అకుంఠిత దీక్షతో, అద్భుతమైన ప్రతిభ కనబరిచారంటూ వారిని వేమిరెడ్డి దంపతులు ప్రశంసించారు. దేశమంతా గర్వపడేలా 23 దేశాలను ఓడించి విశ్వవిజేతగా నిలిచి భారత గ్రామీణ క్రీడాకారులలో ఆత్మస్థైర్యం నింపారని, ఈ విజయం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఏకకాలంలో రెండు ప్రపంచ కప్పులు సాధించిన ఈ అరుదైన రికార్డు చరిత్రలో నిలిచిపోతుందని వారు సంతోషం వ్యక్తం చేశారు.

# 17 మందికి..జడ్పీలో పదోన్నతులు



నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న మండల పరిషత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ఇంజనీరింగ్ శాఖలలో పనిచేస్తున్న పంచాయతీరాజ్ ఆఫీస్ సబార్డినేట్లు 17 మందికి రికార్డ్ మరియు ల్యాబ్ లైబ్రరీ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీ సీఈవో ఎం.విద్యారమ, డెప్యూటీ సీఈవో జె.మోహన్‌రావు చేతులమీదుగా వారు ఇటీవల పదోన్నతి ఉత్తర్వులు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు లక్కాకుల పెంచలయ్య, ప్రధాన కార్యదర్శి వి.దేవ ప్రసన్నకుమార్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కే.భీమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె మాబాషా పాల్గొని జడ్పీ ఛైర్‌పర్సన్‌కు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ పరిపాలనాధికారి ఎన్ వి సుబ్రహ్మణ్యం, యన్.వి.రవికుమార్, పి.హరిహరరెడ్డి, ఎస్‌కె ముజీబ్, అనిల్ కుమార్, బివి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# 25న.. శ్రీ త్యాగరాజ సంగీత వైభవం

నెల్లూరులోని 'చేతన' సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25న కుమారి మల్లాది అనూష బృందం వారిచే 'శ్రీ త్యాగరాజ సంగీత వైభవం' కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. స్థానిక టౌన్‌హాలులోని వర్ధమాన సమాజంలో సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇమామి ఆగ్రోటెక్ (కృష్ణపట్నం) వైస్‌ప్రెసిడెంట్ ఎంవి నారాయణమూర్తి, విశిష్ట అతిథిగా విఆర్‌సి విశ్రాంత తెలుగు శాఖ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

# మాలకొండకు 11.75 లక్షల ఆదాయం

జిల్లాలోని ప్రసిద్ధ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన.. మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి జనవరి 18వ తేదీ శనివారం ఒక్కరోజులోనే హుండీ కానుకలు, సేవాటికెట్ల విక్రయాలు వగైరాల ద్వారా మొత్తం 11,75,113 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఓ కేవీ సాగర్‌బాబు తెలిపారు. అందులో స్వామివారి ఆలయంలో అన్నదానం నిర్వహణకు 3,85,559 రూపాయలు, లడ్డూ ప్రసాద వితరణకు 1,65,005 రూపాయలను దాతలు విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు.






జానకిరామ.. 49

# రామాయణం

- ఊటుకూరు జానకి రామారావు



అప్పుతీసుకొని ఎగగొట్టిన వాడి ఇంటిముందు ఏ విధంగా హరంచేస్తూ అడ్డంగా పడుకొంటారో ఆ విధంగా పడుకున్నాడు భరతుడు.

భరతా నేనేమి నేరం చేశానని ఇలా అడ్డంగా పడుకున్నావు. అయినా ఇలా అడ్డంగా పడుకొనుటకు బ్రాహ్మణులకు మాత్రమే అనుమతి ఉంది, క్షత్రియులకు లేదు. లేవయ్యా! లే... అని పలికాడు.

అప్పుడు భరతుడు, చుట్టూ చేరిన ప్రజలకు నమస్కరించి అందరినీ ఉద్దేశించి.. నేనింతగా ప్రాధేయపడుతున్నా మీరెవ్వరూ ఉలకరూ పలుకరేమి? అని ప్రశ్నించాడు.

అప్పుడు ఆ పౌరజానపదులంతా ముక్తకంఠంతో రాముడి గూర్చి మాకు బాగా తెలుసు. ఆయన యుక్తమైనవే మాట్లాడ తాడు. తండ్రిమాట పాలించాలనే ఉదాత్తమైన ఆశయమున్న రాముని మేము ఏ విధంగా మరలించగలం? అని అన్నారు.

వారి మాటలు విన్న రాముడు, భరతా! విన్నావుగా అందరి అభిప్రాయం, లే లేచి నన్నూ, జలాన్ని తాకు అని అన్నాడు.

(ఎందుకు ఆయనను స్పృశించి జలాన్ని తాకాలి?

ఏదైనా చిన్న దోషం సంభవించినప్పుడు మనకన్నా పెద్ద వారిని తాకి ఆచమనం చేస్తే ఆ దోషం పోతుంది.

అక్కడ సాక్షాత్తు తమ గురువుగారుండగా వారిని కాదని తననెందుకు తాకమన్నాడు? అంటే ఇంకెప్పుడూ హఠం చేయక నా మీద ఒట్టుపెట్టుకో అని అర్థమేమో!)

రాముడి మాటలు విన్న భరతుడు లేచి ఆచమనంచేసి ఎదురుగా ఉన్న మంత్రులు, పౌరులూ, జానపదులూ, విద్వాంసులతో ఇలా అన్నాడు.

నేనెన్నడూ రాజ్యం ఇమ్మని నా తండ్రిని అడుగలేదు, అందుకోసం నా తల్లిని ప్రేరేపించనూ లేదు, రాముడి అరణ్యవాసాన్ని నేను ఎప్పుడూ సమర్థించలేదు.

తండ్రిగారి మాట ప్రకారం అరణ్యంలో పదునాలుగేండ్లు నివసించటానికి నేను సిద్ధం!

భరతుడి సంకల్పాన్ని చూసి ఆశ్చర్యపోతూ.. రాముడు ఈ విధంగా పలికాడు.

నా తండ్రి ఉండగా జరుపబడిన లావాదేవీలను మార్చుటకు నాకుగానీ, భరతునకు గానీ అధికారంలేదు.

మాత కైకేయి రాజ్యం తన కుమారునకు కట్టబెట్టమని నా తండ్రిని కోరటంలో ఇసుమంతైనా దోషంలేదు. వివాహ సమయంలో ఆమె తండ్రికి, మా తండ్రి గారు ఆ విధంగానే కదా వాగ్దానం చేసి ఉన్నది.

ఆ వాగ్దానం నిలుపుకొనుటకు మా తండ్రిగారు భరతునకు రాజ్యమిచ్చుట యుక్తమైనటువంటిదే!

రణభూమిలో నా తండ్రికి సహాయం చేసినందులకు గాను మాత కైకకు ఒసగిన వరం... ఆమె ఇప్పుడు నా తండ్రిని నెరవేర్చమన్నది. దాని ప్రకారం నాకు అరణ్యవాసం విధించుట ఒక మహారాజుగా ఆయనకు గల అధికారానికి సంబంధించింది. అదియు గాక తండ్రి ఆజ్ఞ పుత్రునకు శిరోధార్యం. అదే ధర్మం.

కావున నా అరణ్యవాసం, భరతుడి పట్టాభిషేకం విషయంలో మాత కైక మరియు తండ్రిగారు చేసిన పని యుక్తమే!

భరతుడు ఓర్పుగలవాడు, పెద్దలను పూజించువాడు, సత్యసంధుడు, మహాత్ముడు అని నాకు తెలుసు. ఆయనకి మంగళమగుగాక.

అంతేగాక వనవాస విషయంలో నా బదులుగా భరతుని పంపుట అత్యంత జుగుప్సాకరమైన విషయం. నేను వనవాసం చేయకుండుట వలన నా తండ్రికి అసత్యదోషం కలుగుతుంది, నా తండ్రికి ఆ అపవాదు ఎన్నటికీ కలుగకుండుగాక!

నేను వనం నుండి తిరిగి వచ్చి భరతునితో కూడి పరిపాలన చేయగలవాడను.. అని ప్రజలందరితో పలికాడు శ్రీరాముడు.

రామభరతుల అన్యోన్యమైన ప్రేమ, వారి ధర్మనిష్ఠ అక్కడ చేరినవారందరి మదిలో ఆశ్చర్యం కలుగచేసింది.

ఆహా!.. ధర్మమూర్తులైన వీరిని కన్న ఆ దశరథుడు ధన్యుడు కదా!

ఎవరి మాట వారిదే – ఎవరి పట్టుదల వారిదే!

ఈ రాజ్యం నాది కాదు, నీవే ఏలుకో అని భరతుడు! తండ్రికిచ్చిన మాట మీద నుండి రవ్వంతైనా జరగను అని రాముడు! ఎవరి పట్టు వారిదే! ఈ ధర్మమూర్తులను చూసి అక్కడ చేరిన ఋషిగణమంతా ప్రశంసించింది.

కానీ! వారికి తెలుసు, రావణ సంహారం జరగాలంటే రాముడు అడవిలో ఉండాల్సిందే! లోక కళ్యాణం కోసం వనవాసిగా రాముడు జీవించాల్సిందే.

అందుకే వారంతా ముక్తకంఠంతో భరతా నీవు ఉత్తమకుల సంజాతుడవు, గొప్ప బుద్ధిమంతుడవు, మంచి ఆచారం తెలిసిన వాడవు, గొప్ప కీర్తికలవాడవు, నీకు నీ తండ్రిపై గౌరవభావం ఉన్నచో రాముడు చెప్పినట్లుగా చేయి.

దశరథుడు కైక ఋణము తీర్చుకున్నందువలననే స్వర్గానికి వెళ్ళగలిగినాడు. ఇప్పుడు రాముడు వెనుకకు మరలెనా! దశరథునకు అనృతదోషం కలిగి, స్వర్గంనుండి నెట్టివేయ బడతాడు... అని స్పష్టంగా చెప్పగా... అది విన్న భరతుడు గజగజవణికిపోతూ మాటలు తొట్రుపడుతుండగా.. రామా! రాజ్యం పాలించే సమర్థత నాకు లేదయ్యా! అని అన్నాడు.

అందరూ నీ కోసమే ఎదురు చూస్తున్నారు. నీవు రావలసిందే అని ప్రార్థిస్తూ రాముడి కాళ్ళమీద పడ్డాడు.

భరతుడిని దగ్గరకు తీసుకొని! భరతా నీవు సమర్థుడవు కావని ఎవరన్నారు? నీకు గురు శిక్షణ, ఉత్తమమైన బుద్ధి ఉన్నాయి, బుద్ధిమంతులైన అమాత్యులతో కలిసి ఎంత గొప్ప కార్యాన్నైనా చేయగల సమర్థుడవు నీవు.

నీ తల్లి కైక కోరిక వల్లనో, ఆశవల్లనో, నీ కొరకు ఇంత చేసింది. నీవు దానిని మనసులో ఉంచుకొనక ఆమెను గౌరవించు.

రాముడి దృఢసంకల్పానికి భరతుడు తలవొగ్గక తప్పలేదు.

బంగరు పాదుకలు రెండు రామునికిచ్చి... ఇవి నీవు నీ కాళ్ళతో తాకి నాకు ఇవ్వు! ఈ పాదుకలే ఇక నుండీ రాజ్యమేలుతాయి.

అంత రాముడు ఆ పాదుకలను ఒకసారి తొడుగుకొని విడిచి భరతునకు ఇచ్చాడు.

చిత్రకూటపర్వతం మీద జరిగిన సమావేశం బహుచిత్రమైనది. ఎవరికివారు వారి ప్రాణాలను అక్కడ వదలి, కేవలం శరీరాలతో మాత్రమే అయోధ్యకు పయనమయ్యారు.

శ్రీరాముడు అనే అయస్కాంతం వారి ప్రాణాలను తనతోనే ఉంచుకుంది.

అయోధ్యలో మునుపటి అందం లేదు. జనుల ముఖాలలో ఆనందం లేదు.

ఎంతో ఉత్సాహంగా ఉండేవారు వారంతా!! జీవితపు ప్రతిక్షణం ఉత్సవమే వారికి.. రాముడున్న రోజులలో.

ఇప్పుడు అవేవీ లేవు. బ్రతుకు ఈడుస్తున్నారు, అంతే!

శ్మశాన నిశ్శబ్దాన్ని సంతరించుకొని బావురుమంటున్న అయోధ్యలో ఉండబుద్ధికాలేదు భరతుడికి. వచ్చీరావడంతోనే అన్నపాదుకలు నెత్తిన పెట్టుకొని నందీగ్రామం బయలుదేరాడు.

మంత్రిగణమంతా ఆయన వెంట బయలుదేరింది.

ప్రతి చిన్నవిషయాన్ని భక్తితో పాదుకలకు నివేదించి మాత్రమే రాచకార్యాలు చక్కబెడుతున్నాడు భరతుడు.

అక్కడ చిత్రకూటం మీద మునులందరూ రాముడిని చిత్రంగా చూడటం మొదలుపెట్టారు. వారి చూపులు అదో రకంగా ఉంటున్నాయి.

రాముడికి అనుమానం కలిగింది. విషయం ఏమై ఉంటుందా! అని.

కులపతి అయిన ఒక వృద్ధ తాపసిని అడిగాడు.

ఆయన రామా! మేమంతా వలస వెళుతున్నాం. నీవు వచ్చిన దగ్గర నుండీ నీ మీద కక్షకట్టిన రాక్షసమూక మమ్మల్ని ప్రశాంతంగా ఉండనీయటంలేదు, తాపసులను చంపుతున్నారు, యజ్ఞవిధ్వంసం కావిస్తున్నారు. బ్రతుకు భారమయ్యింది రామా! ఇక్కడ.. అని వాపోయాడు.

అందుకు రాముడు మీకేమీ భయం లేదు, నేనున్నాను అని చెపుతున్నా వినిపించుకోకుండా అందరూ బయలుదేరి వెళ్ళిపోయారు.

రాక్షస మాయ నుండి సీతాదేవికి భయం కలుగకుండా ఆవిడను అంటిపెట్టుకొని రాముడు కొన్ని రోజులు ఆశ్రమంలోనే ఉండిపోయాడు.

ఆయనకు ఇంకా ఎక్కువరోజులు అక్కడే ఉండటానికి మనస్కరించలేదు. పైగా ఆ ప్రాంతమంతా సైన్యం విడిది చేసినందువల్ల చిత్తడిగా తయారై శోభావిహీనంగా మారిపోయింది.

.. (సశేషం)

# భారతీయుల ఆశలపై నీళ్లు

## వలసలపై ట్రంప్ దూకుడు నిర్ణయాలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విషయంలో భయపడినదంతా జరిగింది. అమెరికా గడ్డపై పుట్టిన పిల్లలకు సహజంగా వచ్చే పౌరసత్వం రద్దుచేస్తూ తీసుకున్న సంచలన నిర్ణయంతో లక్షలమంది భారతీయ పిల్లలు, యువతపై ప్రభావం పడనుంది. వారంతా భారత్‌కి తిరిగొచ్చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

అక్రమంగా అమెరికాలో ఉంటున్న వారితో పాటు, విద్యార్థి వీసాలు, పర్యాటక వీసాలు, తాత్కాలిక ఉద్యోగ అనుమతుల వీసాలతో దేశంలో ఉంటున్నవారికి జన్మించే పిల్లలకు ఇక అమెరికా పౌరసత్వం లభించదు. జన్మతః పౌరసత్వం ఇవ్వడం అనేది ప్రపంచంలో ఏ దేశంలోనూ లేదని, తాము కూడా ఇచ్చేది లేదని ట్రంప్ స్పష్టం చేశారు. తల్లిదండ్రుల్లో కనీసం ఒకరికైనా అమెరికా పౌరసత్వం, శాశ్వత నివాసం, గ్రీన్‌కార్డ్, అమెరికా మిలిటరీ సభ్యత్వం ఇలా ఏదైనా ఒక గుర్తింపు ఉంటేనే వారి పిల్లలకు జన్మతః దేశ పౌరసత్వం ఇస్తామని తేల్చి చెప్పారు. అమెరికా ప్రజలు కొన్ని దశాబ్దాలుగా ఈ పౌరసత్వ విధానాన్ని రద్దుచేయాలని కోరుతున్నారని, వారి ఆకాంక్షల మేరకే రద్దు చేస్తున్నానని ట్రంప్ చెప్పారు. ఇప్పటివరకు అమెరికా మాత్రమే ఇలాంటి పౌరసత్వం అందిస్తోందని ట్రంప్ చెబుతున్న విషయంలో వాస్తవం లేదు. దాదాపు 30దేశాలు, విదేశీ మహిళలు తమ గడ్డపై ఉంటూ పిల్లలకు జన్మనిస్తే అటువంటి పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని అందజేస్తున్నాయి. అమెరికాలో అంతర్యుద్ధం తర్వాత 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ శరణార్థుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది.

### ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వెనక్కి

జన్మతః వచ్చే పౌరసత్వ విధానాన్ని రద్దుచేసే ఉత్తర్వులే కాకుండా ట్రంప్ మరికొన్ని వివాదాస్పద ఉత్తర్వులు కూడా జారీ చేశారు. బైడెన్ జారీ చేసిన 78 ఆదేశాలను వెనక్కి తీసుకొన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నుంచి వైదొలగుతూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఈ సంస్థకు వచ్చే ఆర్థిక సాయంలో పెద్దఎత్తున కోత పడనుంది. కృత్రిమమేధ అభివృద్ధి, ప్రయోగాలు, విస్తరణను నియంత్రిస్తూ పూర్వ అధ్యక్షుడు బైడెన్ జారీ చేసిన ఆదేశాలను ట్రంప్ తొలగించారు. ఇప్పటికే కృత్రిమమేధ చూపించబోయే ఆధిపత్యం, ప్రతికూల ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు ఉన్న నేపథ్యంలో నియంత్రణ ఎత్తివేయడంతో ఈ నిర్ణయం వివాదాస్పదమవుతోంది. వాతావరణ మార్పులకు సంబంధించిన కీలకమైన పారిస్ ఒప్పందం నుంచి వైదొలగుతూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపించే కొన్ని నిర్ణయాలు ఇవి. మరికొన్ని అంతర్జాతీయ వివాదాస్పద నిర్ణయాలు కూడా ట్రంప్ తీసుకున్నారు. ఇవి కాకుండా అమెరికాలో ప్రభావం చూపించే మరికొన్ని దూకుడు నిర్ణయాలు కూడా ఆయన చేపట్టారు.

మనసులో మాట 29

### జన్మతః పౌరసత్వం రద్దుతో భారతీయులపై ప్రభావం ఎంత?

అమెరికాలో దాదాపు 1.40 కోట్ల మంది సరైన పత్రాలు లేకుండా ఉంటున్నారని అంచనా. వీరిలో 7.25లక్షల మంది భారతీయులని అంటున్నారు. అమెరికా జనాభాలో దాదాపు 50లక్షల మంది భారతీయులే. వీరిలో మూడో వంతు మంది అమెరికాలో పుట్టిన వారు. వీరి తల్లిదండ్రుల్లో ఏ ఒక్కరికి గ్రీన్ కార్డు లేకున్నా వారికి పౌరసత్వం లభించదు. ట్రంప్ ఇచ్చిన ఈ ఉత్తర్వులు నెల రోజుల తర్వాత నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే ఈ ఉత్తర్వులు న్యాయ సమీక్షలో నిలబడే అవకాశాలు లేవు. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ కారణంగా ఈ ఉత్తర్వును చట్టబద్ధంగా అమలు చేయడం సాధ్యం కాదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఆ విషయం ట్రంప్‌కు కూడా తెలుసు. కానీ ట్రంప్ ఇతర అధ్యక్షులు, ఇతర రాజకీయనేతల్లాంటి వారు కాదు. ప్రజానాడి బాగా తెలిసిన మాస్ లీడర్. ప్రజల్లో ఉన్న భావోద్వేగాలను బట్టి హామీలు ఇచ్చే వ్యక్తి. తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే వీసాలపై స్థానిక ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను గమనించి, వలస విధానాలను ప్రక్షాళిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. కానీ కొన్ని కారణాల వల్ల పూర్తిస్థాయిలో వలస విధానాలను మార్చలేకపోయారు. రెండోసారి అధికారంలోకి రావడంతో ప్రజా మద్దతు పెద్ద ఎత్తున ఉందని గ్రహించారు. అందుకే దూకుడు నిర్ణయాలు తీసేసుకుంటున్నారు. ట్రంప్‌నకు కీలక మద్దతుదార్లుగా ఉన్న ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి కూడా ట్రంప్ వలస విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. అయినా ట్రంప్ వెనక్కి తగ్గడం లేదు. ఈ వ్యాసంలో ఇంతకు ముందు చెప్పినట్లు, ఈ వ్యాసకర్త గతంలోని వ్యాసాల్లో చెప్పినట్లు ట్రంప్‌కు అమెరికాలోని స్థానిక ప్రజల భావోద్వేగాలే ముఖ్యం. మన దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం వచ్చే నాలుగేళ్లు ట్రంప్ కోణంలోనే అమెరికాని చూసి నిర్ణయాలు తీసుకోవాలి తప్పించి అమెరికా గత సంప్రదాయాలు, అమెరికా ప్రజాస్వామ్య వారసత్వ కోణంలో చూడకూడదు. మన యువతరం అమెరికా వెళ్లేది మెరుగైన సంపాదన, మెరుగైన జీవన ప్రమాణాల కోసం. ఈ రెండు అంశాల్లో భారత్ చాలా వేగంగా వ్యవస్థలను మెరుగుపర్చుకుంటూ వెళ్లాలి. 2047లో భారత స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరిగేనాటికి అన్ని రంగాల్లో పూర్తి స్వయం సమృద్ధి సాధించి ఇతర దేశాలపై ఆధారపడే అవసరాన్ని గరిష్ఠంగా తగ్గించుకోవాలి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# శ్రీసిటీ - టిల్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



శ్రీసిటీలోని టిల్ హెల్త్ కేర్ పరిశ్రమ తన కార్పొరేట్ సామాజిక భాద్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా, శ్రీసిటీ ఫౌండేషన్‌తో కలిసి చెరివి గ్రామంలో ఈనెల 21వ తేదీ మంగళవారం నుంచి మూడు రోజుల ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించింది. శ్రీసిటీలో శంకర నేత్రాలయ ఆసుపత్రికి చెందిన ప్రముఖ కంటి డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది ఈ శిబిరంలో వైద్య సేవలు అందించారు. మొదటిరోజు 145 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి చుక్కలు మరియు మందులను టిల్ హెల్త్ కేర్ పరిశ్రమ యాజమాన్యం వారు ఉచితంగా పంపిణీ చేశారు. కంటి సమస్యలున్న వారిని గుర్తించి ఉచితంగా కంటి అద్దాలు కూడా అందచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 'టిల్' చొరవను శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కొనియాడారు. శ్రీసిటీలోని మరిన్ని కంపెనీలు ఇలాంటి ఆరోగ్య సంరక్షణ శిబిరాలను నిర్వహించడానికి ముందుకు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. టిల్ హెల్త్ కేర్ ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ అరుణ్ మంగ్లా, వైస్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్ రాఠి, మార్కెటింగ్ మేనేజర్ మనోజ్ నాయర్, హెచ్ఆర్ మేనేజర్ రవిచంద్ర, శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్రబాబుకు..'కీర్తి పురస్కారం'



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, స్థానిక కెఎన్ఆర్ నగరపాలక సంస్థ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబును తెలుగు కీర్తి జాతీయ పురస్కారం వరించింది. గత రెండున్నర దశాబ్దాలుగా తెలుగు భాషకి, తెలుగు సాహిత్యానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారం లభించింది. ప్రముఖ అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న విజయవాడలో నిర్వహించిన సభలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మెన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రామావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం, బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేసి సన్మానించారు. ముత్తుకూరు మండలం దమ్మాయిపాళెం గ్రామానికి చెందిన నరేంద్రబాబు గత ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ వారిచే ఉత్తమ కవి పురస్కారాన్ని అందుకున్నారు. 2022లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కూడా ఆయనకు లభించింది. 2012వ సంవత్సరం నుంచి 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి- నెల్లూరు విభాగంలో ఆయన అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్‌గా ఉంటూ ఇటీవలే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ఎన్‌సిసి డైరెక్టరేట్ స్థాయిలో ఉత్తమ ఎన్‌సిసి నేవల్ ఆఫీసర్ అవార్డును కూడా సాధించారు.

## ఎమ్మెల్యే కాకర్ల చేతులమీదుగా..

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

- బాధితులకు 21.35 లక్షల సాయం



వింజమూరు మండలం బొమ్మరాజుచెరువు గ్రామంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఉదయగిరి నియోజకవర్గంలోని నిరుపేద బాధితులకు దాదాపు 21లక్షల 35వేల విలువ గల 16 చెక్కులను బాధితులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో తోడ్పడుతుందని, చాలామంది నిరుపేదలు ఆసుపత్రుల పాలై ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారికి సిఎం రిలీఫ్ ఫండ్ బాగా ఉపయోగపడుతుందని అన్నారు.

# ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి (ఇంజనీరింగ్ కళాశాల)లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ములుమూడి రాజేష్‌కు డాక్టరేట్ లభించింది. 'ఏఐ అనేబుల్డ్ పవర్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ ఇన్ రెన్యువబుల్ ఇంటిగ్రేటెడ్ స్టాండ్ ఎలోన్ సిస్టమ్స్' అనే అంశంపై, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.ఏ.లక్ష్మీదేవి పర్యవేక్షణలో ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించడంతో, కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, ట్రిబుల్ ఇ విభాగాధిపతి డా.ఎస్.సురేష్‌రెడ్డి, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు. డాక్టరేట్ పొందడానికి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తనకు సహాయసహకారాలు అందించారంటూ రాజేష్ ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

---

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఉక్కుకు సహకారం.. సంతోషకరం

### ఎమ్మెల్యే పాశిం సునీల్



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో విశాఖ ఉక్కు పరిశ్రమకి కేంద్రప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించడం సంతోషంగా ఉందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 21న విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది తెలుగువారి వీరోచిత పోరాటాల కృషే ఉక్కుపరిశ్రమ అని, పరిశ్రమకి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించడం అభినందనీయమని చెప్పారు. బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, గుండాల లీలావతి, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, రహీమ్, ఇస్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరు, ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా జరిగిన గ్రామీణ క్రీడల పోటీల్లో బొంగరాలాటలో ప్రథమ స్థానం సాధించి, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న ఎం.పురంధరరాజు

# ఆనిమెళ్ళకు నెల్‌క్యాస్ట్ సర్వీస్ అవార్డ్




గూడూరులోని నెల్‌క్యాస్ట్ కంపెనీ 40వ వార్షికోత్సవం, కంపెనీ వ్యవస్థావకులు కీ॥శే॥ పొన్నవోలు రాధాకృష్ణారెడ్డి 70వ జయంతి కార్యక్రమాలు ఈ నెల 16న జరిగాయి. ఈ సందర్భంగా 35 సంవత్సరాల పాటు నెల్‌క్యాస్ట్‌కు తన సేవలందించిన పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఆనిమెళ్ళ శివకుమార్‌కు నెల్‌క్యాస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పొన్నవోలు దీపక్‌రెడ్డి ఉత్తమ 'సర్వీస్ అవార్డు'ను అందజేసి సత్కరించారు.

# 'ప్రజాకవి' యోగి వేమన జయంతి



గూడూరు, డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో ఈ నెల 19న రెడ్డి సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిలు మాట్లాడుతూ యోగి వేమన ప్రజాకవి, సంఘసంస్కర్త, తత్వవేత్త అని, ఆయన రాసిన పద్యాలు అందరికీ అర్థమయ్యే విధంగా ఉంటాయన్నారు. సంఘం అధ్యక్షులు శ్రీకిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, దశరథరామిరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్పీగా గీతాకుమారి



గూడూరు సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో ఈనెల 20న గూడూరు డీఎస్పీగా గీతా కుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గూడూరు సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేస్తామని, ట్రాఫిక్ క్రమబద్దీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈమె గతంలో ఎక్సైజ్ సి.ఐగా, తహసిల్దార్‌గా పనిచేశారు. గ్రూప్-1 ఉత్తీర్ణత సాధించి, తొలి పోస్టింగ్‌లో డిఎస్పీగా గూడూరుకు వచ్చారు.



కాగా, బాధ్యతలు చేపట్టిన గీతాకుమారిని డి.వి.ఎం.సి మాజీ సభ్యులు అరవ పార్వతయ్య, దాసరి వెంకటేశ్వర్లు, మాలమహానాడు గూడూరు డివిజన్ అధ్యక్షులు దాసరి కృష్ణ, సునీతా సేవాసంస్థ ప్రధానకార్యదర్శి సారంగం సులక్ష్మి, అధ్యక్షులు సారంగం శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించారు.

### డిఎస్పీని కలిసిన బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు



గూడూరులోని డిఎస్పీ కార్యాలయంలో బుధవారం గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు శివకుమార్ డిఎస్పీ గీతాకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. పలు సమస్యలను ఆయన డిఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు.

# వృద్ధులను ఆదరించాలి



వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ హేమలత అన్నారు. ఈనెల 22న నెల్లూరులో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవ చేసిన సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానసిక వ్యాధులకు ముఖ్యమైన కారణం ఒత్తిడి అని, దానిని నివారించేందుకు యోగా చేయడంతో పాటు మంచి పుస్తకాలు చదవాలని సూచించారు. నిజమైన ఆనందం కుటుంబంతో గడపడం, పుస్తకాలు చదవడం, సమాజ సేవ చేయడంలో ఉందన్నారు. నారాయణ డెంటల్ కాలేజ్ డాక్టర్ కన్నన్, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గోవిందయ్య, ఏ. జయప్రకాశ్, సంస్థ నిర్వాహకులు శ్యామ్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25న..వేదాయపాళెంలో
# శ్రీనివాస కల్యాణం

నెల్లూరు, వేదాయపాళెంలో ఉన్న వేద గణపతి సెంటర్‌లో ఈనెల 25 శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. స్థానిక సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో స్వామి వారికి పుష్పయాగ మహోత్సవం కూడా వైభవోపేతంగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చి ఈ వేడుకలను తిలకించి స్వామివారి కృపాకటాక్షలకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. వేడుకలకు వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తులతో రావాలని, ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, స్వామివారికి పూలు, పండ్లు, కొబ్బరికాయలు సమర్పించవచ్చని వారు పేర్కొన్నారు.




# 'డైట్'లో వేడుకగా..'రంగోత్సవ్'

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని ప్రభుత్వ 'డైట్' విద్యాసంస్థలో ఈనెల 22న జిల్లాస్థాయి రంగోత్సవ్ కార్యక్రమం జరిగింది. డైట్ ప్రిన్సిపాల్ డా.కె.వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ పాల్గొన్నారు. జిల్లాలోని 8 పాఠశాలల నుండి 60 మంది విద్యార్థులు 8 విభాగాలలో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు పతకాలు, బహుమతులు అందజేశారు.

### విజేతలు వీరే...

ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచినవారు ఈనెల 24న జరిగే రాష్ట్రస్థాయి రంగోత్సవ్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో..క్విజ్‌లో ఎస్కె అన్మోల్ జహరా, ఎంవి సాయిదీక్షిత్ (ఒవెల్ మోడ్రన్ స్కూలు–నెల్లూరు) ప్రథమస్థానం సాధించారు. అదేవిధంగా, చిత్రలేఖనంలో కె.దస్తగిరి (జెడ్పీహెచ్ఎస్– తోటపల్లి గూడూరు), చేతివ్రాత పోటీలో యస్.కె.ఆయేషా (జడ్పీహైస్కూల్–గండవరం), ముగ్గుల పోటీలో పి.దీక్షిత, సీహెచ్ మేఘన (ప్రభుత్వ ఉన్నత పాఠశాల–పల్లిపాడు). జానపద నృత్యంలో వై.చైత్రనాగసాయి, బి.కుమారి, డి.దేవికశ్రీ, ఎస్కె షర్మిల, కె.సుజిత (ఎంకెఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇందుకూరుపేట) నినాదాలు రాయడంలో ఎస్ మౌనిక (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పల్లిపాడు) ప్రథమస్థానాల్లో నిలిచారు. హెడ్మాస్టర్ బి.దశరథ రామిరెడ్డి, ఉపాధ్యాయులు అచ్చుతమణి, ఎం.అనూష ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని నిర్వాహకులు తెలియజేశారు.

# చినబాబు భజన

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చారని, అలాగే తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలను కోటికి పెంచి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లారంటూ ఆకాశానికెత్తేశారు. యువతలో మంచి ఫాలోయింగ్ ఉన్న నేతను డిప్యూటీ సీఎం చేయమనడంలో తప్పేముందంటూ ముక్తాయించారు. ఇక అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే వాసు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణమరాజు తదితరులు కూడా లోకేష్‌ను ఉపముఖ్యమంత్రిని చేయాల్సిందేనంటూ వ్యాఖ్యానించారు. ఇక మంత్రి టీజీ భరత్ దావోస్ పెట్టుబడుల సదుస్సులో మాట్లాడుతూ లోకేష్‌ను ఏకంగా సీఎం చేయాలన్నారు. అయితే, ఇవన్నీ ఇతర పార్టీల నాయకులకే కాకుండా సొంత పార్టీ నాయకులకు కూడా చిరాకు తెప్పించాయనే వాదనలు వినపిస్తున్నాయి. ప్రశాంతంగా సాగుతున్న కూటమి పాలనకు ఇది అపశృతిగా పరిణమించే అవకాశం ఉందని.. ఇప్పటికే సకలశాఖల మంత్రిగా.. డీపాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో వెంటనే లోకేష్‌ను డెప్యూటీ సీఎం చేయాల్సిన అవసరం ఏముందని అంతర్గతంగా చెవులు కొరుక్కుంటున్నట్లు సమాచారం. చివరికి పార్టీలో అత్యంత సీనియర్ నాయకుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా లోకేష్‌ను డెప్యూటీ సీఎం చేయాలనడం పలువురిని విస్మయానికి గురిచేసిందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. తాజాగా గురువారం నాడు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కూడా చంద్రబాబు తర్వాత పార్టీలో నెం.2 స్థానం లోకేష్ బాబుదే అని నొక్కి వక్కాణించారు.

### జనసేన నాయకుల విసుర్లు

లోకేష్‌ను డెప్యూటీ సీఎం చేయాలంటూ తెలుగుదేశం నాయకులు డిమాండ్ చేస్తున్న క్రమంలో గత ఎన్నికల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా, అసలైన గేమ్ ఛేంజర్ అయిన తమ నాయకుడు పవన్ కల్యాణ్‌ను వెంటనే ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోబెట్టాలని.. అలాగైతే లోకేష్‌ను ఉపముఖ్యమంత్రిని చేయడానికి తమకు అభ్యంతరం లేదంటూ కొందరు నాయకులు ప్రతిస్పందించడం వివాదాస్పదమైంది. స్కిల్ స్కాంలో చంద్రబాబును జగన్ ప్రభుత్వం అరెస్టుచేసి రాజమండ్రి జైలుకి తరలించినప్పుడు టీడీపీకి బాసటగా ఉండడమే కాకుండా అసలు కూటమి ఏర్పడడానికి, తెలుగుదేశం పార్టీ మళ్లీ బీజేపీతో కలవడానికి పవన్ కల్యాణే కారణమని, అలాంటి తమ నాయకుడి స్థాయిని.. కావాలని తగ్గిస్తే సహించబోమని జనసేన నాయకులు హెచ్చరించడం కూటమిలో కుస్తీలాట మొదలైందనే వాదనలకు బలం చేకూర్చినట్లయ్యింది.

### సోషల్ మీడియాలో ముదిరిన వార్

తెలుగుదేశం, జనసేన నాయకుల మధ్య ప్రస్తుతం సోషల్ మీడియా వార్ అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా పట్టుమని పదిశాతం ఓట్లు కూడా లేని పార్టీ నాయకుడిని సీఎం ఎలా చేస్తారంటూ టీడీపీ ప్రశ్నిస్తుండగా.. అసలు తమ నాయకుడే లేకుంటే తెలుగుదేశానికి అధికారం అందని ద్రాక్షగా మారి ఉండేదని జనసేన నాయకులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఈ విమర్శలు అంతకంతకూ ఎక్కువౌతుండడంతో పాటు వ్యక్తిగతంగా కించపరుచుకునే స్థాయికి చేరుతున్నాయనే వాదనలూ విపిస్తున్నాయి. ఉదాహరణకు వాపును చూసి జనసేన నాయకులు బలుపనుకుంటున్నారని, పోని అని చేరదీస్తే చెవులు పిండే స్థాయికి చేరుకుంటున్నారని తెలుగుదేశం కార్యకర్తలు పోస్టులు పెడుతుండగా.. ఏరుదాటాక తెప్పతగలేయడం.. పొమ్మనలేక పొగబెట్టడం టీడీపీకి అలవాటని, వెంటిలేటర్‌పై ఉన్న పార్టీకి ఆక్సిజన్ అందించి అధికారంలోకి తీసుకొస్తే తమ నేత పదవికే ఎసురుపెట్టడం ఏం నైజమని జనసేన నాయకులు విమర్శిస్తున్నారు.

### అనుమాన బీజాలు పెరగకుండా.. అప్రమత్తం

డెప్యూటీ సీఎం వ్యవహారం.. తొలుత వినతులతో ప్రారంభమై.. విజ్ఞప్తుల స్థాయికి చేరి చివరికి విమర్శలకు కారణమయ్యే పరిస్థితి నెలకొనడంతో తెలుగుదేశం అధిష్టానం నష్ట నివారణ చర్యలు ప్రారంభించినట్లు కనిపిస్తోంది. ఇకపై లోకేష్ డెప్యూటీ సీఎం పదవి వ్యవహారంపై ఎవరూ మాట్లాడవద్దని టీడీపీ స్పష్టం చేసింది. మీడియా సమక్షంలోకానీ, బహిరంగ వేదికలపై కానీ ఎలాంటి ప్రకటనలు చేయవద్దని తేల్చి చెప్పింది. తమ వ్యక్తిగత అభిప్రాయాలను నాయకులు పార్టీపై రుద్దే ప్రయత్నం చేయవద్దని హితవు పలికింది. ఏ నిర్ణయం అయినా కూటమి నేతలు కూర్చుని మాట్లాడకుంటారని స్పష్టం చేసింది. ఇక 2014–19 మధ్యకాలంలో లోకేష్‌ను ఆగమేఘాలపై ఎమ్మెల్సీని చేసి మంత్రి పదవి అప్పగించడం తీవ్ర వివాదాస్పదమైంది. అంతేకాక ఆ వ్యవహారం 2019 ఎన్నికల్లో ఓటమికి కూడా ఓ కారణమైన నేపథ్యంలో టీడీపీ అధిష్టానం లోకేష్ డెప్యూటీ సీఎం వ్యవహారంపై ఆచితూచి స్పందించాలని చూస్తున్నట్లు సమాచారం. కొందరు నాయకుల అత్యుత్సాహం పార్టీకి చేటు చేస్తుందని లోలోన మదనపడుతున్నట్లు తెలిసింది. గతంలో ఇలాగే జగన్ విమర్శల మాయలో పడి ప్రత్యేకహోదా విషయంలో బీజేపీతో విభేదించి అర్ధాంతరంగా ఎన్డీయే నుంచి విడిపోయి తగిన మూల్యం చెల్లించుకున్నామని, ఇప్పటికిప్పుడు అవసరం లేని పదవి కోసం జనసేనతో విభేదాలు కొనితెచ్చుకోవడం ఎందుకని భావిస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో లోకేష్‌కు డెప్యూటీ సీఎం లాంటి ప్రతిపాదన ఏదీ లేదని ప్రకటించకుండా.. ఇప్పుడు మాట్లాడొద్దంటూ టీడీపీ అధిష్టానం ఆదేశాలు జారీచేయడంలో ఏదో మతలబు ఉందంటూ జనసేన నాయకులు లోలోన చర్చించుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది.

ఏదేమైనా డెప్యూటీ సీఎం వ్యవహారం కూటమిలోని పార్టీల మధ్య టీకప్పులో తుపానులా సమసిపోతుందో..? బుడమేరు వరదలా బీభత్సం సృష్టిస్తుందో కాలమే సమాధానం చెప్పనుంది. ఇక తగిన అనుభవం, పార్టీపై పట్టు సాధించుకున్న తర్వాతే లోకేష్ 'పెద్ద' పదవిపై ఫోకస్ చేస్తే బాగుంటుందని విశ్లేషకులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో జనసేన పార్టీ అధిష్టానం కూడా డెప్యూటీ సీఎం వ్యవహారంపై బహిరంగంగా మాట్లాడొద్దంటూ ఓ నోట్ విడుదల చేయడం గమనార్హం. ఇక కూటమిలో మూడో పార్టీ అయిన బీజేపీ ఈ విషయంలో ఎలా స్పందిస్తుందన్నది కూడా ఆసక్తికరంగా మారింది. జనవరి 23న లోకేష్ పుట్టిన రోజుని కూడా రాష్ట్రంలోని చినబాబు బృందం బాగా వాడుకున్నారు. ఏ జిల్లాకి ఆ జిల్లాలో ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలని ప్రకటనలతో నింపేశారు. మొత్తంమీద చినబాబు భజన కూటమిలో విభజనకి ఆజ్యం పోస్తుందేమో అన్న ఆందోళన టీడీపీ శ్రేణుల్లోనే ఎక్కువగా కనపడడం కొసమెరుపు ...!

# దానవుడికి.. దండన!

(మొదటిపేజీ తరువాయి)

విధులు నిర్వహించి రెస్ట్ రూంకి వచ్చిన వైద్యురాలిపై సంజయ్‌రాయ్ అనే వలంటీర్ అనే ముసుగు కప్పుకున్న మృగాడు పైశాచికత ప్రదర్శించి చివరికి ఆమె ప్రాణాలనే హరించాడు. అంతేకాక మరణించిన తర్వాత కూడా అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. ఈ నేపథ్యంలో నిందితుడిని దోషిగా తేలుస్తూ సిల్దా కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. తుదిశ్వాస వరకూ జైలులోనే ఉండేలా తీర్పు చెప్పింది. అయితే, ఈ తీర్పును బాధితురాలి కుటుంబం తీవ్రంగా వ్యతిరేకించింది. నిందితుడికి మరణశిక్ష విధించే వరకు పోరాడతామని ప్రకటించింది. అలాగే కోర్టు ప్రకటించిన రూ.17లక్షల పరిహారాన్ని కూడా తీసుకోబోమని తేల్చిచెప్పింది. కాగా, ఈ కేసులో ట్రయల్ ప్రారంభమైన కేవలం మూడు నెలల వ్యవధిలోనే తీర్పు వెలువడడం గమనార్హం.

### కేసు నేపథ్యం ఇదీ..

గతేడాది ఆగస్టు 9న ఆర్జీకర్ ఆస్పత్రిలో మహిళా డాక్టర్‌పై హత్యాచార ఘటన చోటు చేసుకుంది. ఈ కేసులో కోల్‌కతా హైకోర్టు ఆదేశాలతో సీబీఐ విచారణ చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్ టెస్టు నిర్వహించడం సహా ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌తో పాటు పలువురిని సీబీఐ ప్రశ్నించింది. ఇక హత్యాచార ఘటనపై నిరసన తెలుపుతున్న వారిపై దాడి జరగడం అప్పట్లో సంచలనం రేపింది. ఈ ఘటనపై పశ్చిమ బెంగాల్ సర్కార్‌ను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. మరోవైపు డాక్టర్‌పై హత్యాచార ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో భారీర్యాలీ నిర్వహించిన సీఎం మమతా బెనర్జీ నిందితుడిని ఉరి తీయాలంటూ డిమాండ్ చేశారు. రాజకీయ రంగు పులుముకుంటున్న సమయంలో ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటాగా స్వీకరించింది. దేశంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై వైద్య నిపుణులతో నేషనల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఇక కేసులో దర్యాప్తు పూర్తి చేసిన సీబీఐ నిందితుడికి ఉరిశిక్ష విధించాలంటూ సిఫార్సు చేసింది. అయితే సిల్దా కోర్టు దోషి సంజయ్ సింగ్ చచ్చేవరకు జైలులో ఉండేలా శిక్షను ఖరారు చేసింది.

### కనువిప్పు కలిగిస్తుందా..?

ఇక అత్యంత తొందరగా కేసు విచారణను చేపట్టి నిందితుడు సంజయ్‌రాయ్‌కు శిక్ష ఖరారు చేసినా.. మరణశిక్ష విధించకపోవడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా దేశవిదేశాల్లో చర్చనీయాంశమైన కేసులో ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ మరింత చిత్తశుద్ధిని కనబరచాల్సిన అవసరం ఉందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. తద్వారా దేశంలోని మృగాళ్లకు కనువిప్పు కలిగించాలని.. బాలికలు, మహిళలపై దురాగతాలకు పాల్పడే వారికి హెచ్చరికతో కూడిన గుణపాఠం చెప్పాలని ఆకాంక్షిస్తున్నారు. అలాగే చిన్నతనం నుంచి ప్రతి కుటుంబంలో మానవతా విలువలను పెంపొందించాలని తద్వారా ఇతరుల పట్ల దయాగుణం కలిగించేలా చేయాలని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీంతో పాటు ఇతరుల అభిప్రాయాలను గౌరవించే విధంగా పిల్లలను పెంచాలని, వారికి చిన్నా, పెద్ద, గురువు, దైవం అనే భావనను బాల్యంలోనే పెంపొందించాలని కోరుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు కూడా ఆలోచించి పాఠ్య ప్రణాళిక, బోధనా ప్రక్రియల్లో దాన్ని భాగం చేసినప్పుడే సమాజంలో పశుత్వాన్ని అంతమొందించి పాపం, పుణ్యం, సోదరభావం వంటి గుణాలను విద్యార్థి దశ నుంచే తీసుకొచ్చి ఉత్తమ పౌరులను తయారుచేసే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్



'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈనెల 18న నెల్లూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు మొక్కలు నాటారు. కార్యాలయాల ఆవరణల్లో పిచ్చిమొక్కలు తొలగించి, పరిశుభ్రతా పనులు నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఏ) ప్రాంగణంలో ఆ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజ కుమారి పాల్గొని పరిసరాలను శుభ్రం చేసి, స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ విశిష్టతను అందరికీ తెలియజేశారు. జిల్లా సహకార శాఖ కార్యాలయంలో డీసీఓ గురప్ప ఆధ్వర్యంలో, వ్యవసాయశాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ సత్యవాణి, పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌నాయక్‌ల సారధ్యంలో మొక్కలు నాటి స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

# రైల్వే డీఎస్పీగా మురళీధర్

నెల్లూరు రైల్వే డీఎస్పీగా ఇటీవల జి.మురళీధర్ నియమితులయ్యారు. 1991 బ్యాచ్‌కి చెందిన ఆయన, రాయలసీమ జిల్లాల్లో వివిధ హోదాల్లో నిబద్ధతతో పనిచేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌సి, ఎస్‌టి సెల్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన్ను బదిలీల్లో భాగంగా నెల్లూరు రైల్వే డీఎస్పీగా నియమించారు.

# బాధ్యతలు చేపట్టిన.. బాలాజీనగర్ ఎస్ఐ



నెల్లూరులోని బాలాజీనగర్ ఎస్ఐగా ఎం.పుల్లారెడ్డి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఆయన నగర డీఎస్పీ శ్రీనివాస రెడ్డిని, ఇన్‌స్పెక్టర్ సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# యోగాలో.. నెల్లూరు మాస్టర్ల ప్రతిభ



చెన్నైలో ఇటీవల జరిగిన యోగా పోటీల్లో నెల్లూరుజిల్లా వాసులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. చెన్నైలోని విట్స్ కళాశాలలో నిర్వహించిన ఆలిండియా యోగా మాస్టర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 40 ఏళ్ల వయసున్న వారి విభాగంలో కొడవలూరు మండలం గండవరానికి చెందిన యోగా గురువు జ్యోతి రాజేంద్రకుమార్ స్వర్ణపతకం సాధించారు. అదేవిధంగా 60 ఏళ్ళ వయసున్నవారికి జరిగిన పోటీలో బి.రఘురామయ్య కూడా స్వర్ణపతకం కైవసం చేసుకున్నారు. 50 ఏళ్ళ విభాగంలో నెల్లూరుకు చెందిన యోగా మాస్టర్ ప్రసన్నకుమార్‌కు రజత పతకం లభించింది. యోగా కోఆర్డినేటర్ చిన్నికృష్ణ, నిర్వాహకులు కార్తికేయన్, జ్యూరీ సభ్యులు గురుకిరణ్, రఘుపతి చేతుల మీదుగా వారు ఈ అవార్డులను అందుకున్నారు.

# క్రికెట్ విజేతలకు నగదు బహుమతులు



సంక్రాంతి పండుగల సందర్భంగా ఇటీవల కలిగిరిలో క్రికెట్ పోటీలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. కలిగిరి క్రీడాకారులు అత్యద్భుతంగా ఆడి ప్రథమస్థానాన్ని సాధించగా, ద్వితీయ బహుమతిని పాపనముసలిపాళెం గ్రామంలోని క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. జడ్పీటీసీ సభ్యులు పాలూరు మాల్యాద్రి చేతుల మీదుగా విజేతలకు 15,116 రూపాయలు, రెండో బహుమతి కింద 7,116 రూపాయలు, మూడో బహుమతి విజేతలకు 5,116 రూపాయల వంతున నగదు బహుమతులందజేశారు.

# చెస్‌లో సత్తాచాటిన..జీవీకే చిన్మయ విద్యార్థి



ఇందుకూరుపేటలోని జీవీకె చిన్మయ విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న హరిరామ్ సాయికృష్ణ చెస్‌లో తన సత్తా చాటాడు. ఇటీవల చెన్నైలో జరిగిన 15వ అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని, అమెరికాకి చెందిన గ్రాండ్ మాస్టర్ రాసెట్ జియాటినోవ్‌పై విజయం సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఈనెల20న రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్ అభినందించారు. నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్కులో శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ వారితో కలసి ఆ విద్యార్థిని అభినందించి జ్ఞాపికనిచ్చి సన్మానించారు.

# విశాఖ ఉక్కుకు నిధుల కేటాయింపు హర్షణీయం

విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం 11వేలా 500కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించడం హర్షణీయమని, దీంతో త్వరలోనే ఆ కర్మాగారానికి పూర్వవైభవం వస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిశ్రమను లాభాల బాటలో నడిపించడమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అన్నివిధాల సహకారం అందిస్తోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోడీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, మోడీ సారధ్యంలో రాష్ట్రం, దేశం ఎంతో పురోగతిని సాధిస్తున్నాయని ఆయన వివరించారు. బీజేపీ నాయకులు లాల్‌ఖాజా మస్తాన్, కపూర్, శౌరి శ్రీనివాస్, మోతీసింగ్, సాయికుమార్ పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్‌పై అవగాహన పెంపొందించాలి

**- ఎస్ఇ విజయన్**

పీఎం సోలార్ విద్యుత్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు కృషిచేయాలని ఏపీఎస్పీడీసిఎల్ ఎస్ఇ విజయన్ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని కోటమిట్టలో ఉన్న విద్యుత్‌శాఖ రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వినియోగదారుల హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌కు ప్రభుత్వం పెద్దఎత్తున రాయితీలు అందిస్తోందని, 'సూర్యఘర్' పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే వినియోగదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. విద్యుత్‌శాఖ డెప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు అశోక్, సునీల్, కిరణ్, ఏఇఇ సురేఖ పాల్గొన్నారు.

# 25 నుంచి.. అంతర్జాతీయ 'కాయిన్స్ ఎక్స్‌పో'



ఈనెల 25, 26 తేదీల్లో నెల్లూరు-ముత్తుకూరురోడ్డులోని పార్థసారథినగర్‌లో ఉన్న సద్గురు సిల్వర్‌ఓక్స్ స్కూల్‌లో అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తామని ఆ స్కూల్ డైరెక్టర్లు షణ్ముఖాచారి, వి.వెంకటాద్రినాయుడు తెలిపారు. ఇటీవల ఆ స్కూల్‌లో ఆమేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి వారు మాట్లాడుతూ, ఈ ఎక్స్‌పోలో అనేక దేశాలకు చెందిన కరెన్సీ, పురాతన కాలం నాటి నాణేలు, స్టాంపులు వగైరాలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. విజయవాడలోని శ్రీధర్ సిసిఇ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రదర్శనను తిలకించడానికి ఆసక్తిగల పాఠశాలల యాజమాన్యాలు ముందుగా సంప్రదిస్తే, వారికి తగిన సమయం కేటాయిస్తామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరు ఈ ఎక్స్‌పోను ఉచితంగా సందర్శించవచ్చన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రావు, అడ్మిన్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, విజయవాడ శ్రీధర్, సంస్థకు చెందిన హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# రవాణా కార్యాలయ సిబ్బందికి వైద్యపరీక్షలు

రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఇటీవల నెల్లూరులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందికి రెయిన్‌బో ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి, అవసరమైనవారికి మందులిచ్చారు. ఆర్టీఓ సిరిచందన, ఎంవీఐలు ఎం.డి రఫీ, కార్తీక్, ఏఎంవీఐలు స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, ఏఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

# ప్రజాపిత బ్రహ్మాబాబా సేవలు చిరస్మరణీయం

నెల్లూరులోని ప్రజాపిత బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖ వారి ఆధ్వర్యంలో ఇటీవల ఆ సంస్థ వ్యవస్థాపకుడైన ప్రజాపిత బ్రహ్మాబాబా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సమాజంలో ఆధ్యాత్మికత, శాంతి సహనం పెంపొందించేందుకు ఆయన అనుసరించిన విధానాలను ఈ సందర్భగా బ్రహ్మకుమారీలు వివరిస్తూ, ఆ మహనీయుని సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల బాటలో అందరూ నడవాలని ఆకాంక్షించారు. బ్రహ్మకుమారీలు ప్రసన్న, సుమతి, నిర్మల అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...

### పెంచలకోనలో నేత్రపర్వంగా నృసింహుని కల్యాణం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలో కొలువైవున్న ఆదిలక్ష్మి-చెంచులక్ష్మీ సమేత శ్రీ నృసింహస్వామి కల్యాణోత్సవం ఇటీవల నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేసి, కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

### బ్రహ్మదేవిలో పంచాయతి సమావేశం

ముత్తుకూరు మండలం బ్రహ్మదేవి పంచాయతీ కార్యాలయంలో ఇటీవల జిల్లా పంచాయతి అధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు సిబ్బంది కృషిచేయాలని ఆయన చెప్పారు. సర్పంచ్ సుధాకర్, నాయకులు బొబ్బేపల్లి అంకయ్య, దయాకర్, టీడీపీ నాయకుడు కొత్తపల్లి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

### సంగం పీహెచ్‌సీ తనిఖీ

మండల కేంద్రమైన సంగంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని ఇటీవల జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పీహెచ్‌సీలోని ఫార్మసీ విభాగం, డెలివరీ రూమ్, ల్యాబ్‌లను సందర్శించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. వైద్యాధికారి డాక్టర్ అశోక్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### కరేడులో విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్

కందుకూరు మండలంలోని కరేడు గ్రామంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం వారు ఈనెల 20న ఉచితంగా అందజేశారు. పాఠశాల హెడ్మాస్టర్ పొన్నూరు శ్రీనివాసులు, తల్లితండ్రుల కమిటీ ఛైర్మెన్ కోటంగారి బాలేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పుల్లాయపల్లి పాఠశాలకు దాతల వితరణ

ఉదయగిరి మండలం పుల్లాయపల్లి మండల ప్రాథమికోన్నత పాఠశాలకు దాతలు రమణమ్మ, నరసయ్యలు ఈనెల 20న మూడు టేబుళ్ళు, మూడు కుర్చీలు బహుకరించారు. వాటిని హెడ్మాస్టర్ గాజులపల్లి సుబ్బారెడ్డికి అందజేశారు. అనంతరం విద్యార్థులకు అరటిపండ్లు, స్వీట్లు ఇచ్చారు.

### పెనుబర్తిలో పంట నమోదుపై అవగాహన

నెల్లూరు రూరల్ మండలం పెనుబర్తి గ్రామంలో ఇటీవల జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పి.సత్యవాణి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి, పంటల నమోదుపై రైతులకు అవగాహన కలిగించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీ, వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, లక్ష్మీమాధవి, నాగమోహన్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

### చిరమనలో 'ఆశా' కార్యకర్తలకు శిక్షణ

అనుమసముద్రంపేట మండలంలోని చిరమన గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇటీవల కుష్ఠువ్యాధి సర్వేపై ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ జ్యోతిరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో, ఆశా కార్యకర్తలు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్ళి సర్వే చేసి కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాలను నమోదు చేయాలని చెప్పారు.

### అయ్యవారిపల్లిలో పశు వైద్యశిబిరం

సీతారామపురం మండలం అయ్యవారిపల్లి గ్రామంలో ఈనెల 20న పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శశిధర్ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం ఏర్పాటుచేసి, పశువుల్లో నట్టల వ్యాధి నివారణకు మందులిచ్చారు. పశువులకు వస్తున్న వ్యాధులను నిర్ధారించి, వాటి యజమానులకు తగు సూచనలిచ్చారు.

### ఉదయగిరి దుకాణాలపై అధికారుల దాడులు

ఉదయగిరిలో ఇటీవల తూనికలు కొలతల శాఖ అధికారి కరీముల్లా ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది పలు దుకాణాలపై దాడులు చేసి, నిబంధనలు పాటించనివారిపై కేసులు నమోదు చేశారు. కిరాణా దుకాణాలు, మటన్, చికెన్‌షాపులు, కూరగాయల దుకాణాలలో తూకాలు ఎలా జరుగుతున్నాయో తనిఖీ చేశారు.

# చెత్తను ఊడ్చేద్దాం.. రండి!

## • చీపురు చేతపట్టిన ఎంపీ వేమిరెడ్డి



'చెత్తను ఊడ్చేద్దాం..రండి'.. అంటూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. అంతేకాదు, స్వయంగా చీపురు చేతపట్టి రోడ్డుమీదున్న చెత్తను పరిశుభ్రం చేస్తుంటే, అక్కడున్న నాయకులు.. కార్యకర్తలంతా ఒక్కసారిగా విస్తుపోయి, తాము కూడా కార్యరంగంలోకి దిగారు. ఇందుకూరుపేట మండలం డేవిస్‌పేటలో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమానికి వచ్చిన వేమిరెడ్డి, కేవలం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో కూడా 'స్వచ్ఛత'ను పాటించడంతో గ్రామస్తులు కూడా ఆ స్ఫూర్తినందుకుని వీధులను శుభ్రం చేసుకున్నారు.

'పరిశుభ్రత ఎక్కడ ఉంటే అక్కడ ఆరోగ్యం ఉంటుందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యతనివ్వాలని, ఆరోగ్యానికి సంబంధించి ఇది చాలా ముఖ్యమైన విషయమని' ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇటీవల ఇందుకూరుపేట మండలం డేవిస్‌పేటలో నిర్వహించిన భారీ ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆ ఊళ్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి నెలా మూడవ శనివారాన్ని రాష్ట ప్రభుత్వం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించే రోజుగా ప్రకటించిందని, పరిశుభ్రత కోసం అందరం పాటుపడాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఏదో ఒకరోజు అని కాకుండా, అందరూ తమ జీవితంలో 'స్వచ్ఛత'ను ఒక అలవాటుగా మార్చుకోవాలని, నిరంతరం పరిశుభ్రతపై దృష్టిపెట్టాలని కోరారు. అనంతరం పరిశుభ్రతను పరిరక్షిస్తామంటూ 'స్వచ్ఛ దివస్' ప్రతిజ్ఞ చేశారు.

### గిరిజనులకు దోమతెరలు :

ఇందుకూరుపేట మండలం పాగావారిపాలెం గిరిజన కాలనీలోని గిరిజనులు దోమల బాధతో అవస్తలు పడుతున్నారని తెలుసుకున్న ఎంపీ వేమిరెడ్డి, వారి కోసం దోమతెరలు పంపిణీ చేశారు. ఇటీవల ఆ కాలనీలో నిర్వహించిన ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో వేమిరెడ్డి పాల్గొన్నారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ తెలుగు జాతి గర్వించదగ్గ మహానాయకులని, ఆయన వల్లే తెలుగు జాతికి ఎనలేని గుర్తింపు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరేంద్రనాయుడు, దువ్వూరు కల్యాణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలి





మహిళలు గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని నెల్లూరులోని రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి చెప్పారు. ఇటీవల ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఆ క్యాన్సర్ వ్యాధి లక్షణాలను, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జనవరి నెలను ప్రపంచ ఆరోగ్యసంస్థ 'సర్వైకల్ క్యాన్సర్ అవగాహన మాసం'గా పరిగణించిందని ఆమె తెలిపారు. స్త్రీలలో వచ్చే క్యాన్సర్‌లలో గర్భసంచి ముఖద్వారం క్యాన్సర్‌ను సర్వైకల్ క్యాన్సర్ అంటారని, 'హ్యూమన్ పాపిల్లోమా వైరస్-(హెచ్‌పీవి)' వల్ల ఈ వ్యాధి వస్తుంటుందని వివరించారు. ఈ వైరస్ నివారణకు టీకా కూడా వాడుకలో ఉందన్నారు. ముఖ్యంగా వివాహిత స్త్రీలందరూ సంవత్సరానికి ఒకసారి లేదా మూడు సంవత్సరాలకు ఒకసారైనా ఆరోగ్య పరీక్షలు, పీఏపీ టెస్ట్ వగైరాలు చేయించుకుంటే, ముందస్తుగానే ఈ వ్యాధిని తెలుసుకుని, దాని నివారణకు తగు చికిత్సలు చేయించుకోవచ్చని తెలిపారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యమ్.నాగేశ్వర్‌రావు, జనరల్‌మేనేజర్ ఐ.భక్తవత్సల రెడ్డి, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ గీతఉషశ్రీ, సర్జికల్ అంకాలజిస్ట్ ఆర్ఇఏ ముత్తు, పెథాలజిస్ట్ డాక్టర్ కె.నందిత, మేనేజింగ్ కమిటీ సభ్యులు వి.విజయకుమార్‌రెడ్డి, పేషెంట్ కౌన్సిలర్ జి.కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# 'దోమలపై యుద్ధం' ప్రకటించిన శ్రీధర్‌రెడ్డి

## అధికారులు సమాయత్తం కావాలన్న రూరల్ ఎమ్మెల్యే



నెల్లూరు దోమలకు నిలయంగా మారిందని, దోమల బాధ భరించలేక నగర ప్రజలు నరకయాతన పడుతున్నారని, వాటిని నివారించేందుకు అందరూ సహకరించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకు నిద్ర లేకుండా చేస్తూ, లేనిపోని వ్యాధులకు గురిచేస్తున్న దోమల విజృంభణను అరికట్టేందుకు 'దోమలపై దండయాత్ర' చేయాలని సంకల్పించారు. 34వ డివిజన్ ప్రగతినగర్ బి-బ్లాక్‌లో ఈనెల 21న పారిశుధ్య అధికారులు, సిబ్బందితో కలిసి మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేసి, కిరోసిన్ స్ప్రే చేశారు. 'దోమలపై దండయాత్ర' కార్యక్రమాన్ని రేపటి నుంచి 26 డివిజన్‌లలో ప్రతి రోజు పారిశుధ్య అధికారులు నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. దోమల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాలల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాటి నిర్మూలనకు కావలసిన చర్యలు చేపట్టాలన్నారు. మొత్తం 26 డివిజన్‌లలో ఫాగింగ్ మెషిన్‌లు, ఆయిల్ బాల్స్, కిరోసిన్ మరియు గంబూసియా చేపలు ద్వారా దోమల నివారణా ప్రక్రియను ప్రతిరోజు కొనసాగించాలని ఆయన అధికారులకు చెప్పారు.


ద్వితీయ వర్ధంతి



జననం
24.10.1931

నిర్యాణం
25.01.2023

అనురాగమూర్తి, ఆత్మీయదీప్తి
శ్రీమతి పెనాక లక్ష్మీనారాయణమ్మ గారు
స్వర్గస్తురాలై తేది. 25.01.2025 నాటికి రెండేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆమె దివ్యస్మృతిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు
పెనాక రామ్‌ప్రసాద్‌రెడ్డి
వ్యవస్థాపకులు, అరబిందో ఫార్మా లిమిటెడ్
పెనాక గోపినాథ్‌రెడ్డి

కుమార్తెలు
బొమ్మా సరళ
తోటపల్లి రమాదేవి
మరియు
కుటుంబసభ్యులు

మనుమళ్ళు
పెనాక శరత్‌చంద్రారెడ్డి
పెనాక రోహిత్‌రెడ్డి
పెనాక రామ్‌ధీరజ్‌రెడ్డి
పెనాక రాహుల్‌దీపక్‌రెడ్డి


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com